విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :77 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 7 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

- యూపీఐ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్
- యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం
- ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు
- పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం




## జేఈఈ తరహాలో నీట్

- నీట్‌లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి
- ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షపై సమాలోచనలు : కేంద్రం
- నీట్-యూజీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహణపై సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్
- నీట్ యూజీ పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సన్నాహాలు

### మెనిఫెస్టో హామీయాంలో నామమాత్రంగా

# దిశ

- మహిళల భద్రతపై చట్టసవరణ: సీఎం చంద్రబాబు
- ఈనెల చివర్లోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభం
- అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు
- మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులతో పలు కీలక అంశాలపై సీఎం చర్చ
- ఆస్తుల వేలంతో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం



అమరావతి

ఈనెల చివర్లోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత సహచర మంత్రులతో ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై చర్చించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని సమర్థంగా వినియోగించుకుంటూ తాగునీటి ఎద్దడిని అధిగమించాలని, ఆ తర్వాత ప్రాధాన్యతగా పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈనెల 17, 18, 19, 20 తేదీల్లో 4 రోజుల పాటు శాసనసభ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం తెలిపారు. గత పాలకులు దిశ చట్టం పేరుతో ప్రజల్ని మోసగించి, కేవలం ఉత్తుత్తి పోలీస్ స్టేషన్లు, వాహనాలతో హంగామా చేశారని వివరాలు 2లో..



## ఆక్వా రంగానికి విద్యుత్ రాయితీ

- ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాకు ఆమోదం
- కేబినెట్ కీలక నిర్ణయాలివే
- మూడున్నర గంటలకు పైగా జరిగిన మంత్రివర్గ సమావేశం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్--2026కు గ్రీన్ సిగ్నల్

అమరావతి

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణంలో వేగం, పారిశ్రామిక ప్రోత్సాహకాలు తదితర అంశాలు ప్రధాన అజెండాగా ఏపీ మంత్రివర్గ సమావేశం జరిగింది. అమరావతి నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే కొత్త చట్టాలతో పాటు పెండింగ్ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. విద్యా, వైద్య రంగాలు సహా రహదారి భద్రత, మౌలిక వివరాలు 2లో..

## రూ.3.25లక్షల కోట్లతో 114 రఫేల్ యుద్ధ విమానాలు

- డీల్‌పై భారత్‌కు ప్రపోజల్ పంపిన ఫ్రాన్స్- ఇక్కడే జెట్ల తయారీ!
- రూ. 3.25 లక్షల కోట్ల 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్ ప్రతిపాదన
- మొత్తం 114లో 94 రఫేల్ జెట్లు భారత్‌లోనే తయారీ
- దేశీయ పారిశ్రామిక రంగానికి ఊతం



## జగన్ పర్యటనల్లో అరాచకాలు



- వీడియో విడుదల చేసిన హోం మంత్రి అనిత
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వైఎస్సార్సీపీ బలప్రదర్శనలు
- పరామర్శల పేరిట జగన్ చేసిన బలప్రదర్శన వల్ల ముగ్గురు మృతి
- జగన్ పర్యటనలో అరాచకాల గురించి వీడియో విడుదల చేసిన అనిత

అమరావతి

గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి అడుగు బయట పెడితే రాష్ట్రంలో విధ్వంసం, అరాచకమే జరుగుతోందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరామర్శల పేరుతో ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం, పోలీసుల విధులకు అడ్డంకులు సృష్టిం చడం, బలప్రదర్శనలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. వివరాలు 2లో..




## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్

- విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు.. విశాఖపై పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- నైట్ ఫ్రాంక్ నివేదికలో ముంబయికి ప్రపంచ టాప్-15లో చోటు
- హైదరాబాద్‌కు భారీ ప్రాజెక్టుల వరుస.. విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల అవకాశాలు
- క్లౌడ్, ఏఐతో పెరుగుతున్న డిమాండ్.. భారత్‌కు బలపడుతున్న గ్లోబల్ గుర్తింపు

# పురపోరుకు సిద్ధమవ్వండి

- ఇప్పటికే 13,291 పంచాయతీల ఓటర్ల జాబితా సిద్ధం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్
- పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష
- గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కోసం ఏకంగా 1.36 లక్షల కేంద్రాలను ఏర్పాటు




అమరావతి

పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాల అందుబాటు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సామగ్రి, వార్డుల విభజన తదితర వివిధ అంశాలపై చర్చించారు. స్థానిక పోరులో అత్యంత కీలకమైన బీసీ రిజర్వేషన్ల వ్యవహారంపై డెడికేటెడ్ కమిషన్ సమర్పించే నివేదికను జులై 31 నాటికి సమర్పించాల్సి ఉంది. అయితే మరో నెలరోజులపాటు నివేదిక సమర్పణకు సమయం పొడిగించింది. ఆగస్టు 31 నాటికి ఈ కమిషన్ నివేదిక రానుంది. ఆ తర్వాతే బీసీ రిజర్వేషన్ల అంశం ఓ కొలిక్కి రానున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13,291 పంచాయతీలకు సంబంధించి ఇప్పటికే ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కోసం ఏకంగా 1.36 లక్షల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనాభా ప్రాతిపదికన డివిజన్లు, వార్డుల పునర్విభజన ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కొన్ని కోర్టు వ్యాజ్యాలు కూడా ఉన్నాయి. వీటి అన్నింటిపైనా సంబంధిత అధికారులు సమీక్ష సమావేశంలో ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా వివరాలు 2లో..

## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం



- పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్
- సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం
- సీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర
- కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం

# జగన్ పర్యటనల్లో అరాచకాలు

-మొదటిపేజీ తరువాయి

జగన్ పర్యటనల వల్ల మహిళల భద్రతతో పాటు ప్రజల ఆస్తులకు, చిరు వ్యాపారుల జీవనోపాధికి రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను భయపెడుతూ, విధులు నిర్వహించే పోలీసులను సైతం బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని హోం మంత్రి అనిత మండిపడ్డారు. ఇప్పటివరకు జగన్ చేసిన పర్యటనల వల్ల ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం తప్ప ప్రజలకు ఒరిగిన ఉపయోగమేమీ లేదని స్పష్టం చేశారు. జగన్ పర్యటనల్లో జరిగిన అరాచకాలకు సంబంధించిన వివిధ వీడియో ఆధారాలను మీడియా వేదికగా మంత్రి అనిత విడుదల చేశారు. గొడ్డలి పార్టీ అధినేత ప్రవర్తన భస్మాసురుడిని తలపిస్తోందని హోం మంత్రి అనిత ధ్వజమెత్తారు. భస్మాసురుడు వరం ఇచ్చిన శివుడి నెత్తిన చెయ్యి పెట్టాలనుకున్న రీతిలో ఒక్క అవకాశం ఇచ్చిన ప్రజల నాశనాన్నే గొడ్డలి పార్టీ అధినేత కోరుకున్నాడని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్, వైఎస్సార్సీపీ విన్యాసాలు చూసి దేశం సిగ్గుపడుతుందని ఆమె ఆక్షేపించారు. జగన్ చుట్టూ ఉంది జన్ జీలు ఎంత మంత్రం కాదని వాళ్లంతా గాంజాలే అని ఎద్దేవా చేశారు.



**రైతులను బౌన్సర్లతో కొట్టించడమే కాకుండా**

ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే, జగన్ మాత్రం విధ్వంసం, అరాచకాలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. పరామర్శల పేరుతో జగన్ జరిపిన పర్యటనల్లో సామాన్యులను ఇబ్బందులకు గురి చేసి, వారి ఆస్తులను ధ్వంసం చేశారని ఆరోపించారు. గుంటూరు మిర్చి యార్డు పర్యటనలో రైతులను బౌన్సర్లతో కొట్టించడమే కాకుండా, వైఎస్సార్సీపీ నాయకులు మిర్చి టిక్కీలను దొంగిలించారని విమర్శించారు. సొంత బాబాయ్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ వ్యవహరించిన తీరును గమనించి, తల్లిదండ్రులు తమ పిల్లలను వైఎస్సార్సీపీ కార్యక్రమాలకు పంపవద్దని హోంమంత్రి అనిత హితవు పలికారు.

"గొడ్డలి పార్టీ అధినేత పరామర్శల పేరిట బలప్రదర్శన చేస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా బలప్రదర్శన చేస్తున్నారు. పరామర్శల పేరిట జగన్ చేసిన బలప్రదర్శన వల్ల ముగ్గురు చనిపోయారు. బలప్రదర్శనలు చేయడం వల్ల రోడ్లపై గంటలపాటు ట్రాఫిక్ అవుతుంది. దీనివల్ల పబ్లిక్‌కు ఉపయోగపడే ఒక్క మంచి పని జరిగిందా. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు అడుగు బయటపెడితే విధ్వంసం, అరాచకమే.

బలప్రదర్శనలు చేస్తూ, ప్రజలకు ఏం సందేశం ఇస్తారు జగన్ గొడ్డలి పార్టీ నేతలు బాధ్యతాయుతమైన విమర్శలు చేయాలి. బెట్టింగ్‌లో నష్టపోయి మరణించిన వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారు. ఒక వ్యక్తి జగన్ కారు కింద పడితే, పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జగన్ పరామర్శలో మహిళలపై దాడి చేస్తున్నారు. వైఎస్సార్సీపీ నేతలు పోలీసులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. బాధితులను కాకుండా, నిందితులను జగన్ పరామర్శిస్తున్నారు."

# బియ్యం బదులు నాసిరకం జొన్నలు

## ఏమిస్తే అదే తీసుకోవాలంటూ బెదిరింపులు

అనంతపురం జిల్లాలో పౌరసరఫరాల సంస్థ ద్వారా సరఫరా చేస్తున్న జొన్నలపై కార్డుదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆగస్టు కోటాగా చౌక బియ్యం బదులు కార్డుకు 3 కిలోల జొన్నలు అందిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా 3 కిలోల జొన్నలు శుభ్రం చేస్తే కిలో వరకు వ్యర్థాలు, పుల్లలు, పొట్టు, చిన్నరాళ్లు వస్తుండటంపై కార్డుదారుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. చౌక ధరల దుకాణాలకు సరఫరా కాకముందే నాణ్యంగా లేవని ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు మొర పెట్టుకున్నా పై అధికారులు వినని దుస్థితి నెలకొన్నట్లు ఆరోపణలున్నాయి.



**ఏది ఇస్తే అదే తీసుకోవాలి**

'నేను చెబుతున్నా చౌక ధరల దుకాణాలకు జొన్నలు సరఫరా చేయాల్సిందే' అని ఓ అధికారి గద్దించడంతో చేసేది లేక గోదాముల ఇన్‌ఛార్జులు ఆ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. అయినప్పటికీ వ్యర్థాలతో ఉన్న వాటిని చూసి తీసుకునేందుకు కార్డుదారులు ముందుకు రావడం లేదని, ఏమిస్తే అవి తీసుకోవాల్సిందేనని కొందరు బెదిరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని 1,645 చౌక ధరల దుకాణాల పరిధిలో 6,81,705 రేషన్ కార్డులు ఉండగా ఈ నెల కోటాకు సంబంధించి బియ్యంతో పాటు జొన్నలు సరఫరా చేశారు. కార్డుకు 3 కిలోల చొప్పున 2,045 మెట్రిక్ టన్నులు అవసరం. ఇప్పటికే 1,709 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. 3 కిలోలకు కిలో చొప్పున వ్యర్థాలు పోతుండగా ఆ ప్రకారమే అందించి చేతులు దులుపుకోవడం గమనార్హం.

**బియ్యం స్థానంలో జొన్నలు**

సత్యసాయి జిల్లాలో 1347 చౌకదుకాణాలున్నాయి 587742 రేషన్ కార్డులున్నాయి. ఇక్కడ మాత్రం బియ్యం స్థానంలో జొన్నలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా. ఇప్పటికీ సరఫరా కాలేదు. దీనిపై పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు రమేశ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా విషయం తన దృష్టికి రాలేదన్నారు. జొన్నలు జిల్లాలోని రైతుల వద్ద కొనుగోలు చేసి చౌక దుకాణాలకు సరఫరా చేశామని ఆయన తెలిపారు. పై అధికారులు స్పందించి నాణ్యమైనవి అందించాలని రేషన్? కార్డుదారులు కోరుతున్నారు.

# చిన్నారుల ఆరోగ్యానికి భరోసా

## ప్లాస్టిక్‌కు చెక్ పెడుతూ నీమ్ టాయ్స్ స్టార్టప్

పిల్లల చేతిలో ప్లాస్టిక్ బొమ్మ. వారి నవ్వుల వెనక దాగున్న అనారోగ్య ముప్పు. ఈ ఆలోచనే ఆ యువకుడిలో విప్లవాత్మక మార్పునకు బీజం వేసింది. ప్లాస్టిక్ విష సంస్కృతికి చెక్ పెడుతూ వేపచెట్టులోని ఔషధ గుణాలు, ఆధునిక సాంకేతికతను జోడించి చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాడు. నీమ్స్ టాయ్స్ పేరుతో రకరకాల బొమ్మలు తయారు చేస్తూ పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నాడు. అంతేకాదు స్థానిక మహిళలకు ఉపాధి కల్పిస్తూ నేడు ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్న యంగ్ ఇన్నోవేటర్ స్టాలిన్ సక్సెస్ స్టోరీ ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.



ప్రముఖుల ప్రశంసలు

ప్రస్తుతం మార్కెట్లో దొరికే ప్లాస్టిక్ బొమ్మలు చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో హానికరం. ఈ సమస్యకు పరిష్కారంగా, ఔషధ గుణాలున్న వేప కలపతో ఎలాంటి రసాయనాలు వాడకుండా నీమ్‌టాయ్స్ పేరుతో సరికొత్త ట్రెండ్ సృష్టించాడు ఈ యువకుడు. పర్యావరణ పరిరక్షణ, స్థానిక మహిళలకు ఉపాధి లక్ష్యంగా వేప కలపతో 100 రకాలకు పైగా బొమ్మలు తయారుచేస్తూ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు.

స్టాలిన్ పఠాన్ స్వస్థలం రాజధాని అమరావతిలోని రాయపూడి. తిరువనంతపురం ఏరోనాటికల్ కాలేజీలో ఎంటెక్ పూర్తి చేసిన స్టాలిన్ అక్కడే అధ్యాపకుడిగా పని చేశాడు. విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేందుకు బొమ్మలు తయారుచేసి పాఠాలు బోధించేవాడు. ఈ క్రమంలో నీమ్స్ ఆలోచన చేశాడు. అంతకుముందు కొన్ని రాకెట్ బొమ్మలు తయారుచేసి ప్రత్యక్షంగా విజయవాడలోని దుకాణాల్లో పరోక్షంగా అమెజాన్ ద్వారా విక్రయించాడు. అక్కడ మంచి డిమాండ్ రావడంతో అంకుర సంస్థని స్థాపించాలని అనుకున్నాడు.

బొమ్మల వాడకంలో పిల్లలకు గాయాలు కాకుండా ఉండేలా అత్యాధునిక మెషిన్లు, రౌటర్ సాంకేతికతతో బొమ్మల అంచులను నున్నగా మారుస్తున్నాడు. ఈ వినూత్న ఆలోచనకు ఉన్నత స్థాయి గుర్తింపు, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఈ స్టార్టప్‌ను అభినందించింది. ప్రతిష్టాత్మకమైన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రదర్శనలో నీమ్‌టాయ్స్ ప్రత్యేక గుర్తింపు పొందింది. వీటి మార్కెటింగ్ కోసం స్టాలిన్ వినూత్నంగా ముందుకెళ్తున్నారు. సోషల్ మీడియాలో ఆకట్టుకునే వీడియోలు పెట్టి కస్టమర్లకు దగ్గరవుతున్నాడు. అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలల్లో ఎడ్యుకేషనల్ స్టెంటాయ్స్ విభాగంలోకి ఈ బొమ్మలను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాడు.

**100 మందికి ఉపాధే లక్ష్యం**

ఇటీవల విజయవాడలో జరిగిన హస్తకళా ప్రదర్శనలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్టాలిన్ ప్రతిభను ప్రశంసించారు. పర్యావరణ అనుకూల వ్యాపార శైలిని ప్రత్యేకంగా అభినందించారు. అమరావతి వాకర్స్ అండ్ రన్నర్స్ అసోసియేషన్‌తో కలిసి పాఠశాల విద్యార్థుల ద్వారా వేప మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాడు స్టాలిన్. బొమ్మల తయారీకి ఉపయోగించే ప్రతి వేప చెట్టుకు బదులుగా 3 కొత్త మొక్కలను నాటాలనే సంకల్పాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోన్న స్టాలిన్ ఆ సంఖ్యని 100కి చేర్చడమే లక్ష్యమంటున్నాడు. అమరావతి వాకర్స్ అండ్ రన్నర్స్ అసోసియేషన్‌తో కలిసి పాఠశాల విద్యార్థుల ద్వారా వేప మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. బొమ్మల తయారీకి ఉపయోగించే ప్రతి వేప చెట్టుకు బదులుగా 3 కొత్త మొక్కలను నాటాలనే సంకల్పాన్ని అమలు చేస్తున్నారు. స్థానిక వనరులతో ప్రపంచ స్థాయి నాణ్యత గల ఉత్పత్తులను తయారు చేయవచ్చని నిరూపించటం ద్వారా అమరావతి నుంచి ఒక ఆదర్శవంతమైన పారిశ్రామికవేత్తగా స్టాలిన్ పఠాన్ నిలిచారు.

## పురపోరుకు సిద్ధమవ్వండి

-మొదటిపేజీ తరువాయి

అందుకు అంతా సిద్ధంగా ఉండేలా యంత్రాంగాన్ని సమాయత్తం కావాలని ఎన్నికల సంఘం సూచించింది.

**ప్రతిబందకాలు**

ఇదిలా ఉండగా మరోవైపు రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలన్నిటికీ ఒకేసారి ఎన్నికల నిర్వహణకు ప్రతిబంధకంగా ఉన్న చట్టం నంబరు-5ను ఉపసంహరించుకునే విషయాన్ని ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు పరిశీలిస్తున్నాయి. ఇందుకోసం న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నాయి. చట్టాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పెండింగ్‌లోని కేసుల పరిష్కారానికి ఉపసంహరణే సరైన పరిష్కారమని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖపై సీఎం చంద్రబాబు ఇటీవల నిర్వహించిన సమీక్షలో 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకూ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల కారణంగా 2021మార్చిలో వంద చోట్లే ఎన్నికలు నిర్వహించారు.

## వైఎస్సార్సీపీ హయాంలో నామమాత్రంగా 'దిశ'

-మొదటిపేజీ తరువాయి

మహిళల భద్రతకు తీసుకున్న చర్యలు శూన్యమని మండిపడ్డారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే మహిళల భద్రత కోసం సమగ్రంగా చట్టసవరణ చేసి, మరింత పటిష్టంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎక్కడికక్కడ ఆస్తులను వేలం వేసి బాధితులకు త్వరగా న్యాయం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో క్వాంటం వ్యాలీ ఫంక్షనింగ్ డిసెంబర్ లేదా జనవరిలో ప్రారంభమవుతుందని సీఎం వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభ ఘట్టాన్ని ప్రతి ఒక్కరూ సెంటిమెంటల్‌గా ఓన్ చేసుకున్నారని, అక్కడ సముద్రం మీదుగా విమానాలు వచ్చి రన్ వేపై దిగడం ప్రయాణికులకు ఒక గొప్ప అనుభూతినిస్తుందని చెప్పారు.

**హిందూ దేవుళ్ల చిత్ర పటాలు పగలకొట్టడంపై సీఎం ఆగ్రహం**

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో నిన్న (బుధవారం) అడవి పందులు పొలాల్ని నాశనం చేసిన తరహాలో గొడ్డలి పార్టీ శ్రేణులు వ్యవహరించారని సీఎం ధ్వజమెత్తారు. ఓ మహిళ చిరు వ్యాపారి పొట్ట గొట్టడంతో పాటు హిందూ దేవుళ్ల చిత్రపటాలు పగలకొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని మండిపడ్డారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారని, ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో శాంతి భద్రతల సమస్య సృష్టిస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు. మీటింగ్ అంటే లైసెన్స్ ఇచ్చినట్లు మందు తాగించి తరలిస్తున్నారని, గంజాయి బ్యాచ్‌ని జెన్-జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందన్నారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు.

**అంతకంటే పెద్దదిగా అమరావతి ఐ-వీల్**

ఆక్వా రైతులకు ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అనే తేడా లేకుండా రూ.11 వందల కోట్ల విద్యుత్ రాయితీలు ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించామనే అసూయతోనే వైఎస్సార్సీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసుల్ని న్యాయస్థానాలు కొట్టేసి చివాట్లు పెడుతున్నా బుద్ధి మార్చుకోవట్లేదన్నారు. ఈనెల 13న సీడ్ యాక్సిస్ రహదారి ప్రారంభిస్తామని సీఎం తెలిపారు. దుబాయ్ ఐ-వీల్ 250 మీటర్ల ఎత్తులో ప్రపంచంలో పెద్దదిగా ఉందని, అమరావతి ఐ-వీల్ అంతకంటే పెద్దదిగా ఉండాలన్నారు. మంత్రి నారాయణ రాజధాని నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. సీడ్ యాక్సిస్ రహదారి ప్రారంభించిన తర్వాత అదే రహదారిపై సీఎం ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకూ ప్రయాణిస్తారని, అక్కడే ఎమ్మెల్యే క్వార్టర్ల తాళాలను ముఖ్యమంత్రికి అప్పగిస్తామని చెప్పారు. దసరా పండుగ నాటికి మంత్రుల విల్లాల నిర్మాణం కూడా పూర్తవుతుందని నారాయణ తెలిపారు. మంత్రుల విల్లాల కేటాయింపు బాధ్యతను సాధారణ పరిపాలనా శాఖ (జీఏడీ)కి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల కేటాయింపును అసెంబ్లీ స్పీకర్ కార్యాలయానికి అప్పగిస్తామని నారాయణ వెల్లడించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన '2047 వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా, రాష్ట్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## ఆక్వా రంగానికి విద్యుత్ రాయితీ



-మొదటిపేజీ తరువాయి

వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం 34 పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలినట్లు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. పారిశ్రామిక విప్లవం కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్--2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాలకు ఆమోదం తెలిపారు. పరిపాలనా, చట్టపరమైన సంస్కరణలలో భాగంగా ఏపీ దిశా బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి కొత్త కఠిన చట్టాలను తీసుకురావాలని నిర్ణయించారు. పారిశ్రామిక వేగానికి బల్క్‌డ్రగ్ పార్క్ కోసం హుడ్కో నుంచి 680 కోట్ల రూపాయల రుణం, ఆక్వా రంగానికి యూనిట్‌కు రూపాయిన్నర విద్యుత్ రాయితీని కొనసాగించనున్నారు. అర్బన్? డెవలప్‌మెంట్? అథారిటీల పునర్వ్యవస్థీకరణతో పాటు మున్సిపల్ భూముల లీజు గడువును 25ఏళ్లకు పైగా పెంచేలా చట్టసవరణలకు ఆమోదం తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 34 అజెండా అంశాలకు పచ్చజెండా ఊపింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్--2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 ముసాయిదాలను ఆమోదించింది. ఏపీ దిశా బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి, కొత్త కఠిన చట్టాలను తీసుకురావాలని నిర్ణయించింది. విశాఖ వెలంపేట మురికివాడ పేదలకు 28కోట్ల 44 లక్షలతో బహుళ అంతస్తుల భవనాలను మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. - కొలుసు పార్థసారథి, సమాచార శాఖ మంత్రి

**స్లమ్ పేదలకు ఇళ్లు**

రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్ పనులను వేయి కోట్ల రూపాయలతో ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించి రుణం సమీకరించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు అదనపు డిజైన్ల వ్యయాన్ని 206 కోట్లకు పెంచుతూ సవరించిన అనుమతులు మంజూరు చేశారు. రైతుల యాన్యుటీ చెల్లింపుల కోసం తీసుకున్న 300 కోట్ల రుణానికి, 'అమరావతి ఐ' ప్రాజెక్టు రీ-టెండర్లకు పచ్చజెండా ఊపారు. వైకుంఠపురం ఇనాం భూముల వివాదాన్ని 122 కోట్ల రూపాయల పరిహారంతో శాశ్వతంగా పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నారు. కుప్పం ఎయిర్‌పోర్ట్ బాధితులకు ఎకరాకు 12 లక్షల 44వేల రూపాయల పరిహారం, విశాఖ వెలంపేట స్లమ్ పేదలకు 28కోట్ల 44 లక్షలతో బహుళ అంతస్తుల భవనాలను మంజూరు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఘాట్‌ల అభివృద్ధికి నిధులు: పాదచారుల భద్రతా పాలసీ-2026 అమల్లోకి తెస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాలు- 2027 ఘాట్‌ల అభివృద్ధికి 210 కోట్ల రూపాయలు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విద్యా వ్యవస్థ విస్తరణలో భాగంగా ఆర్?వీఎస్?, ప్రగతి ప్రైవేట్ యూనివర్సిటీలతో పాటు కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులను మంత్రివర్గం ఆమోదించింది.

# రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ని దగా డీఎస్సీగా మార్చింది

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి




**ధర్మవరం,ఆగస్టు 06 (పెన్ సత్తా)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025లో నిర్వహించిన మెగా డీఎస్సీ ని దగా డిఎస్సీగా మార్చింది అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు బాగాన రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, అంతులేని అవినీతి అక్రమాలతో మెగా డీఎస్సీ జరగడం జరిగిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలాడటం కూటమి ప్రభుత్వమునకు అలవాటైందని తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలో వైఎస్ఆర్సిపి యువజన విభాగం, వివిధ విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహార దీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిరుద్యోగులను తప్పుదోవ పట్టించిందని వారు దుయ్యబట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం డీఎస్సీని అమ్ముకొని కోట్లాది రూపాయలను దండుకున్నదని వారు ఆరోపించారు. జీవో నెంబర్ 4 అండ్ 47 లను కొత్తగా తెచ్చి స్పోర్ట్స్ కొట్టాను రెండు శాతం నుండి మూడు శాతానికి పెంచి స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవాధ్యక్షులు టిడిపి ఎమ్మెల్యేలు ఎంపీలను పెట్టి గందరగోళంగా సర్టిఫికెట్లను మంజూరు చేసిందని మండిపడ్డారు. అనహ్రువులకే ఉద్యోగాలను కట్టబెట్టడం జరిగిందని,ఇందుకు సాక్షదారులతో కూడా తాను చూపడం జరిగిందని తెలిపారు. కట్టుదిట్టమైన భారీ భద్రత నడుమ డీఎస్సీ ప్రశ్నాపత్రం డేటాను అవుట్సోర్సింగ్ సిబ్బందికి అప్పగించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నించారు. బాధిత అభ్యర్థులు ఆధారాలతో సహా కోర్టుకు వెళ్ళినప్పటికీ ప్రభుత్వము అనుసరిస్తున్న నిర్లక్ష్యం అవినీతి అక్రమాలకు నిదర్శనమైందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేసి తీరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రం శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం,రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల అమర్నాథ్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాటిల్ శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం గంగాధర్ నాయుడు తో పాటు రేగాటిపల్లి అశోక్ రెడ్డి మదన్ మోహన్ ,రామ్మోహన్ రెడ్డి,ప్రవీణ్,అశోక్, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాంజీ కాంస్య విగ్రహం ఆవిష్కరణ





**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 06:** పట్టణం, వాసవి మాత ముద్దు బిడ్డ, అజాత శత్రువు, స్నేహశీలి, మాజీ మున్సిపల్ చైర్మన్ కడ్మిశెట్టి శ్రీరాములు (రాంజీ) జయంతి సందర్భంగా పెరుగు బజార్, రాతి మేడ వద్ద కాంస్య విగ్రహం, వైశ్య యువజన సంఘం, కంచికా పరమేశ్వరి దేవాలయం అనకాపల్లి వారి ఆధ్వర్యంలో ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా విగ్రహా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాంజీ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ప్రజల మనిషి అన్నారు. కుల, మత, వర్గ, పార్టీ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ, స్నేహితుడిగా, తమ్ముడిగా, అన్నయ్యగా, అండగా నిలిచిన వ్యక్తి అని అందుకే ఆయన ప్రజల్లో ఎంతో మంచి పేరు, విశేష మైన ప్రజా సంబంధాలు ఉన్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ, ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. ఇటువంటి నాయకులు సమాజానికి ఎంతో అవసరం అని, భవిష్యత్ నాయకత్వానికి రాంజీ ఒక ఆదర్శంగా నిలుస్తారని మనమందరం విశ్వసిస్తున్నాం. అలాగే, మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు ని ఈ సందర్భంగా స్మరించుకోవడం మన బాధ్యత. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో

ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ దంపతులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దాడి రత్నాకర్, కన్యకా పరమేశ్వరి సంఘం సభ్యులు, వైశ్య సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# పరవాడ మండలంలో రిలే నిరాహార దీక్షకు వైఎస్సార్సీపీ పిలుపు.

**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 06:** మండలంలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరవాడ సంతబయలులో రిలే నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పయిల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో నిరోద్యగభృతి, ఫీజు రియియంబర్సుమెంట్, ఆడబిడ్డ నిధి నిధులు తక్షణమే విడుదల చేయాలని, మెగా డి.ఎస్.సి లో జరిగిన అక్రమాలు, కుంభకోణం సీబీఐ విచారణ చేపట్టాలని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే నిరుద్యోగ భృతి కింద ఒక్కో నిరుద్యోగికి రూ.3,000 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.




# తల్లిపాలే శిశువుకు తొలి టీకా



**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఆగస్ట్ 06:** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అచ్యుతాపురం మండలం చోడపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సుహాసిని ఆదేశాల మేరకు నిర్వహించిన ఈకార్యక్రమంలో ఏఎన్ఎం మాట్లాడారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. తల్లిపాలే శిశువుకు తొలి టీకాగా పనిచేస్తుందన్నారు. టీకా ద్వారా అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు.

తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని వివరించారు. తల్లిపాలు తాగే పిల్లలు శారీరక, మానసికంగా ఆరోగ్యవంతంగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్తలు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్సీపీ రిలే దీక్షలు!



**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఆగస్ట్ 06:** డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయని మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ విమర్శించారు. వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు. అర్హతతో పరీక్ష రాసిన అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు ఇచ్చిన భృతి హామీని అమలు చేయడంతో పాటు, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. వారికి న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రిలే నిరాహార దీక్షలకు ఎలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్సీపీ పరిశీలకుడు కోలా గురువులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు కుమార్, పార్టీ నాయకులు దేశంశెట్టి శంకరరావు, కోన బుజ్జి, కూంద్రపు వెంకీనాయుడు, ఉమ్మడి జగన్, పిన్నంరాజు రవీంద్రరాజు, వాసుపల్లి శ్రీను, గంగోలి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ రక్షణ.

తల్లిపాల ప్రాధాన్యంపై బాలింతలకు అవగాహన



**ఇచ్ఛాపురం పెన్ సత్తా, ఆగస్ట్ 06:** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు,బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఐసీడీఎస్ అధికారిని రాజేశ్వరి మాట్లాడుతూ శిశువు జన్మించిన తొలి గంటలోనే ముర్రుపాలు పట్టించడం ఎంతో అవసరమని తెలిపారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించి,వివిధ అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కాళ్ల.దిలీప్ మాట్లాడుతూ తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, విటమిన్లు,ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉంటాయని వివరించారు. అనంతరం తల్లిపాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎర్రమ్మ,ఆశ వర్కర్ ఇందిర మరియు అంగన్వాడి సిబ్బంది ఎన్.జ్యోతి, ఫాతిమా,రేఖ,గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరపాలి.. మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి: కురసాల కన్నబాబు



**కాకినాడ రూరల్** కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి.వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ రూరల్ మండలంలోని సర్పవరం జంక్షన్ వద్ద మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సమస్యలను పక్కనబెట్టి అణచివేత ధోరణితో పాలన సాగిస్తోందని విమర్శించారు.డీఎస్సీ నియామక ప్రక్రియలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి డీఎస్సీ నియామకాలపై ఆధారాలతో కూడిన వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల హామీగా ప్రకటించిన నిరుద్యోగ భృతిని ఇప్పటివరకు ఒక్క నిరుద్యోగికీ అందించలేదని విమర్శించారు. తక్షణమే అర్హులైన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ మండలం జడ్పిటిసి నులుకుర్తి రామకృష్ణ రాందేవ్ సూర్యప్రకాష్(చిన్న), వైఎస్ఆర్ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేజీబీవీ టీచర్లను పాత స్థానాల్లోనే కొనసాగించాలి

**– సమగ్ర శిక్ష ఏపీసి అనురాధ కు యుటిఎఫ్ వినతి**



రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు పొందిన జిల్లాలోని 25 మంది కేజీబీవీ టీచర్లను పాత స్థానాల్లోనే యధావిధిగా కొనసాగించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.అనురాధకు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఉదయం కడపలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.అనురాధను యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ జిల్లాలో కేజీబీవీలో ప్రిన్సిపాల్స్‌గా, ఉపాధ్యాయినీలుగా పనిచేస్తున్న 25 మంది వివిధ కారణాలతో తమను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయవద్దని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. కేజీబీవీ టీచర్ల వినతిని పరిశీలించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 25 మంది ఉపాధ్యాయినీలను వారు కొనసాగుతున్న పాత స్థానాల్లోనే కొనసాగించాలని తీర్పు ఇచ్చిందన్నారు. అప్పటికే ఆ ఉపాధ్యాయులకు బదిలీ నిర్వహించినందున, యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యదర్శి దేవానంద రెడ్డిని కలిసి కోర్టు తీర్పును అమలు చేయాలని కోరామన్నారు. ఆ మేరకు కోర్టు తీర్పును గౌరవిస్తూ 25 మంది కేజీబీవీ ఉపాధ్యాయులను పాత స్థానాల్లోనే కొనసాగించాలని రాష్ట్ర కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని, దీంతో సదరు ఉపాధ్యాయులు గత వారం పాత స్థానాల్లో చేరారని తెలిపారు. అయితే అధికారులు ఒకవైపు కోర్టు తీర్పును అమలు చేస్తున్నట్లు ప్రకటిస్తూనే, మరోవైపు వారికి మళ్లీ బదిలీలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తక్కువ వేతనాలతో చాకిరీ చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. వీరిలో కొంతమంది అనారోగ్య సమస్యలతో, మరి కొంతమంది ఆర్థిక ఇబ్బందులతో సుదూర ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వర్తించలేని పరిస్థితులలో ఉన్నారని పేర్కొన్నారు. అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి గౌరవ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు పరుస్తూ పాత స్థానాల్లోనే వారు కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గత ఏప్రిల్ మాసంలో పనిచేసిన పార్ట్ టైం పిజిటిలకు మార్చి మాసం వరకే వేతనం చెల్లించారని, ఏప్రిల్ మాసానికి ఇప్పటివరకు వేతనం చెల్లించకపోవడం తగదన్నారు. తక్షణమే ఏప్రిల్ మాసానికి సంబంధించిన వేతనాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నత న్యాయస్థానం తీర్పు మేరకు కేజీబీవీ ఉపాధ్యాయినీలను పాత స్థానంలోనే కొనసాగించాలని, లేనిపక్షంలో యూటీఎఫ్ పక్షాన ఆందోళన చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.గోపీనాథ్, ఎస్.ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.రామకేశవ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**: ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి**





**బేతంచెర్ల:ఆగస్టు 6** రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకంగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా గురువారం బేతంచెర్ల మండలంలోని కొలుములపల్లె, బలపాలపల్లె గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజలను నేరుగా కలుసుకున్నారు.గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే స్థానికుల సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, పింఛన్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి జరుగుతోందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, వారి సూచనలు, సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే ,ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్సై రమేష్ బాబు, మండల టీడీపీ కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, నంద్యాల పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి ఉన్నం సుధాకర్, పోలూరు శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసులు , మాజీ ఎంపీటీసీ జాకిరిల్లా బేగ్, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, భీమేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ రామాంజనేయులు, మండల టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు రామనాథం, వార్డు సభ్యుడు జగదీష్, జనార్ధన్, మద్దిలేటి సోమశేఖర్, ప్రేమ్ కుమార్, ఎన్. భీశ్వేశ్వరయ్య, నాగ శేషు, ముద్దారం డీలర్ మహేష్, నాగరాజు, ఈశ్వరయ్య, మండల ఐటీడీపీ అధ్యక్షుడు మరికుంట మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

# మితిమీరిన శబ్దాలతో కేకలు వేస్తే ఊరుకోం

**గొల్లప్రోలు ఎస్ఐ నౌడ్ రామకృష్ణ**

**పట్టణంలో ముమ్మర వాహన తనిఖీలు, జరిమానాలు**

**మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు**



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు** గొల్లప్రోలు పరిధిలో గురువారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు ముగిసే సమయంలో కొంతమంది యువకులు మోటార్ బైక్‌ల ఒరిజినల్ సైలెన్సర్లను మార్చి, మితిమీరిన శబ్దాలు చేస్తూ రోడ్లపై తిరుగుతున్నారనే ఫిర్యాదులతో పోలీసులు రంగంలోకి దిగారు. రహదారులపై ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న యువతపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా హెల్మెట్ లేని వారిని, వాహన పత్రాలు సరిగ్గా లేని వారిని అడ్డుకుని జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు ఎస్ఐ నౌడ్ రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల, సాధారణ ప్రజల భద్రతకు భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు. మైనర్ డ్రైవింగ్‌ను పూర్తిగా నిషేధించాలని, అవగాహన లేకుండా పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. పట్టణంలో ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమం.......



తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమం అభివృద్ధి సాధ్యమని పార్టీ పట్టణ అధ్యక్షుడు మౌలాలి, యూనిట్ ఇన్చార్జి జెట్టి నాగరాజు తెలిపారు. బుధవారం చెంచు కాలనీలో ఇంటింటికీ టీడీపీ నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలు టీడీపీకి అండగా నిలవాలని కోరారు. రాజేంద్ర, బారిక్ చామల్, జల్సాగౌస్, యల్లంపల్లె శంకర సుబ్బారావు పాల్గొన్నారు.

## పొంపన్న గౌడ్‌కు పరామర్శ..



బైక్ ప్రమాదంలో గాయపడిన కమ్యూనిస్టు నాయకుడు, కర్నూలు జిల్లా కార్యదర్శి పొంపన్న గౌడ్‌ను టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మాచాని సోమనాథ్, బీజేపీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్‌లు ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో పరామర్శించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

## గోళ్లగూడెంలో కల్వర్టుకు గ్రామస్తుల స్వచ్ఛంద మరమ్మతులు

**శ్రమదానంతో సమస్య పరిష్కారం**

**ప్రభుత్వ సాయం కోసం నిరీక్షించక ముందుకు వచ్చిన ప్రజలు సుగమమైన రాకపోకలు**



గోళ్లగూడెం గ్రామంలో కల్వర్టు వద్ద మట్టి పోస్తున్న గ్రామస్తులు



ట్రాక్టర్ సహాయంతో మట్టిని తరలిస్తున్న గ్రామస్తులు

ఎటపాక మండలంలోని గోళ్లగూడెం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న కల్వర్టు సమీప రహదారిని గ్రామస్తులు, రైతులు గురువారం స్వచ్ఛంద శ్రమదానంతో మరమ్మతు చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా తమ గ్రామ సమస్యను తామే పరిష్కరించుకోవాలనే సంకల్పంతో ముందుకు వచ్చి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి కల్వర్టు వద్ద పోశారు. అనంతరం రహదారిని చదును చేసి వాహనాలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామ ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామస్తుల ఐక్యత, సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచిందని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల సహకారం ఉంటే గ్రామ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి శ్రమదాన కార్యక్రమాలు గ్రామాల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు బాచినేని మల్లేశ్వరరావు, బలుసు సునీల్, బలుసు సుబ్బారావు, దుదుకూరు కన్నయ్య, మల్లాడి దావీదు, కడియాల శ్రీను, యువకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## (ఎస్ ఐ ఆర్) పై బి ఎల్ ఓ లకు అవగాహన కల్పించిన తహసిల్దార్ బాలకిషన్..





మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నందు గురువారం బి ఎల్ ఓ ల సమావేశాన్ని తహసీల్దార్ బాలకిషన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. (ఎస్ ఐ ఆర్) లో పొందుపరచవలసిన విషయాలపై యాప్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.ఎన్నికల సంఘం నియమానుసారంగా వివరాలను పొందుపర్చాలని ఆయన సూచించారు.నిర్ణీత గడువు లోగా ఓటరు జాబితా లో సవరణ చేసి ,పారదర్శకంగా జాబితాను సిద్ధం చేయాలని ఆయన బి ఎల్ ఓ లను ఆదేశించారు.

# చింతలపూడిలో కుంకుమపువ్వు సాగు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కుంకుమ పువ్వు సాగు చేయాలని నిర్ణయించింది. కుంకుమ పువ్వు సాగుకు సంబంధించి చేసిన ప్రయోగాలు విజయవంతం కావడంతో సాగు దిశగా చర్యలు తీసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగు చేయాలని ప్లాన్ చేశారు. అనుమతులన్నీ రాగానే కుంకుమ పువ్వును సాగు చేసేందుకు 30 ఎకరాల భూమిని కేటాయించనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కుంకుమ పువ్వు సాగు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో ప్రయోగాత్మకంగా సాగు చేయగా మంచి ఫలితాలు రావడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి కేంద్రంగా కుంకుమ పువ్వు సాగు చేయనున్నారు. ఏపీ ప్రభుత్వం 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగుకు కేటాయించాలని భావిస్తోంది. వాస్తవానికి ముందు లంగసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగు చేద్దామని భావించారు.. కానీ అక్కడ అనువైన భూమి లేకపోవడంతో చింతపల్లిలో సాగు చేయాలని నిర్ణయించారు.చింతపల్లిలో కుంకు పువ్వు సాగుకు సంబంధించి శాస్త్రవేత్తలు రెండేళ్లుగా చేస్తున్న ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. ఈ ప్రాంతంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో మూడు వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. చింతపల్లిలో కుంకుమ పువ్వు సాగుకు.. కృష్ణా జిల్లాకు చెందిన 'స్నాప్ గ్రీన్‌మ్యాన్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ముందుకు వచ్చింది. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కూడా చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి



అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఏపీ ప్రభుత్వం కుంకుమ పువ్వు సాగు కోసం కేటాయించే 30 ఎకరాల్లో.. 18 ఎకరాల్లో సాగు ఉంటుంది, 3 ఎకరాల్లో ఇండోర్ పర్యావరణ పరిరక్షణ, మిగిలిన 9 ఎకరాల్లో ప్రాసెసింగ్, పరిశోధన, శిక్షణ, పరిపాలనా భవనాలు వంటి వాటి కోసం కేటాయించారు.కుంకుమ పువ్వు సాగు పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసిన వారికి కూడా మంచి అనుభవం ఉంది అంటున్నారు. ఏపీ ప్రభుత్వం ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని చింతపల్లిలో కుంకుమపువ్వు సాగుకు అడుగులు వేస్తోంది. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సుగంధ ద్రవ్య బోర్డు, సేంద్రీయ ధృవీకరణ, ఉద్యానవన శాఖ నుంచి అనుమతులు రాగానే భూమిని అధికారికంగా కేటాయిస్తారు. దేశవ్యాప్తంగా కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ వంటి చల్లని ప్రాంతాల్లో ఎక్కువగా కుంకుమ పువ్వు సాగు చేస్తున్నారు. మనకు 100 టన్నుల డిమాండ్ ఉంటే.. దేశీయంగా కేవలం 3.46 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి 300 టన్నులు ఉంటే.. ఇరాన్, స్పెయిన్ దేశాలు ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నాయి.

# వారసుడిగా విమర్శలు - లోకేష్ పనితీరుపై పొగడ్తలు

విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ముగించుకుని తిరుగుపయనమైన సందర్భంలో.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భుజం తట్టి "శభాష్ లోకేశ్! చాలా బాగా పనిచేస్తున్నావు.. ఇదే వేగం, స్ఫూర్తితో ముందడుగు వేయి" అని అభినందించడం కేవలం ఒక సాధారణ వీడ్కోలు మర్యాద మాత్రమే కాదు. భారత రాజకీయాల్లో సీనియర్ నేతల గుర్తింపు పొందడం అంత సులభం కాని తరుణంలో, ప్రధాని స్థాయిలో లభించిన ఈ ఆత్మీయ ప్రశంసా వాక్యాలు నారా లోకేశ్ పాలనా నైపుణ్యానికి, క్రమశిక్షణతో కూడిన పట్టుదలకు దక్కిన జాతీయ స్థాయి ముద్రగా చెప్పుకోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన ప్రారంభంలో లోకేశ్ తీవ్ర ప్రతికూల విమర్శలను, సోషల్ మీడియా ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. వారసత్వం అనే నైతిక బరువుతో ప్రయాణం ప్రారంభించిన ఆయన, విమర్శలను ఎదురుదాడికి సాకుగా మార్చుకోకుండా పరిపాలనా సామర్థ్యం, పక్కా కార్పొరేట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో తనను తాను మలచుకున్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి చొచ్చుకెళ్లడం, మంగళగిరి నియోజకవర్గంలో రికార్డు విజయం సాధించడమే కాకుండా.. కార్నెగీ మెల్లన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల విద్యాభ్యాసం అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనలో సమర్థవంతంగా వినియోగిస్తూ ఒక ప్రొఫెషనల్ లీడర్‌గా ఎదిగారు.విజయనగరం భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం, యోగాంధ్ర ప్రపంచ రికార్డు కార్యక్రమాల నిర్వహణ, లేదా గతంలో ప్రధాని మోదీ ఏపీ పర్యటనల



సమన్వయం ఇలా ప్రతి ఈవెంట్‌లోనూ లోకేశ్ చూపించిన ఆర్గనైజింగ్ స్కిల్స్ ప్రధానిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్, గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌తో పాటు విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై ప్రధాని మోదీ ముందే సమాచారం పొంది ఉండటంతోనే.. వేదికపై పబ్లిక్‌గా లోకేశ్‌ను ప్రశంసించారని స్పష్టమవుతోంది. ఇది ఒక యువ నాయకుడి కష్టానికి, పారదర్శక కార్యాచరణకు దక్కిన ప్రతిఫలం అనుకోవచ్చు. వారసత్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించే ప్రధాని మోదీ గతంలో లోకేష్ ను కూడా విమర్శించారు. కానీ ఇప్పుడు అభినందిస్తున్నారు. ప్రధాని శభాష్ అని అనడం వెనుక లోకేశ్ సొంతంగా సంపాదించుకున్న గుర్తింపే ప్రధాన కారణం. ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల వికాస శాఖల మంత్రిగా గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించడంలో లోకేశ్ నిరంతరం విదేశీ ప్రతినిధులతో సమావేశమవుతూ చురుగ్గా పనిచేస్తున్నారు. పెట్టుబడుల సేకరణ, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పనలో ఆయన చూపుతున్న వేగం జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశమైంది. మరోవైపు విపక్షాలు చేసే రాజకీయ విమర్శలకు సైతం లోకేశ్ ఇప్పుడు సంయమనంతో, సమాచార ఆధారిత సమాధానాలు ఇస్తూ ఒక సీనియర్ స్టేట్స్‌మన్‌లా వ్యవహరిస్తున్నారు. పార్టీలో తండ్రి చంద్రబాబు నాయుడి పక్కన ఒక బలమైన రెండో శ్రేణి నాయకత్వంగా నిలబడటమే కాకుండా, ఎన్డీయే కూటమి సమన్వయంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. పవన్ కల్యాణ్ వంటి జనసేన అధినేతతో, బిజెపి కేంద్ర నాయకత్వంతో సౌహార్ద్రపూర్వక సంబంధాలను నిర్వహిస్తూ కూటమికి బలమైన ఆధారంగా నిలిచారు.సొంత ప్రయాణంలో తండ్రి నీడ నుంచి బయటకు వచ్చి, తనదైన శైలిలో పాలన సాగిస్తూ, శభాష్ అని ప్రధాని చేత పటించుకోవడం ఒక యువ నేతకు అతిపెద్ద పొలిటికల్ మైలురాయి. దేశంలోనే అత్యంత ప్రామిసింగ్ యంగ్ పొలిటీషియన్లలో ఒకరిగా ఎదిగిన లోకేశ్‌కు ప్రధాని ఇచ్చిన ఈ బూస్ట్, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, విద్యా వికాసంలో మరింత వేగాన్ని నింపడమే కాక.. జాతీయ స్థాయిలో ఆయన ప్రాధాన్యతను మరింత పెంచనుందనడంలో సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఐఎన్ఎస్ డేగ ఇక జ్ఞాపకమేనా !!

ఆరు దశాబ్దాలకు పైగా విశాఖపట్నానికి విమానంలో వచ్చిన ప్రతి ప్రయాణికుడూ సాధారణ విమానాశ్రయంలో దిగలేదు... భారత నౌకాదళ వైమానిక స్థావరంలోనే అడుగుపెట్టాడు. మీ విమానం ల్యాండ్ అయిన అదే రన్‌వేపై ప్రతి ఉదయం హాక్ జెట్ శిక్షణ విమానాలు గర్జిస్తూ ఆకాశంలోకి దూసుకెళ్లేవి. టెర్మినల్ పక్కనే జలాంతర్గాములను వేటాడే హెలికాప్టర్లు నిలిపిన హ్యాంగర్లు కనిపించేవి. పౌర విమానాలు, యుద్ధ విమానాలు... రెండూ ఒకే రన్‌వేను పంచుకోవడం విశాఖకు మాత్రమే ప్రత్యేకమైన దృశ్యం. "విశాఖ అంటే అంతే" అన్నట్టే వైజాగ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ సాగాయి.ఆగస్టు 1, 2026న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురంలోని "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని" ప్రారంభించారు. ఆగస్టు 17నుంచి అన్ని కమర్షియల్ విమాన సర్వీసులు అక్కడికి మారనున్నాయి. దీంతో ఆరు దశాబ్దాలుగా ప్రయాణికులను ఆహ్వానించిన ఐఎన్ఎస్ డేగా ఇకపై పూర్తిగా నావికాదళ విమాన స్థావరంగానే కొనసాగనుంది.ఈ సందర్భంగా ఒక ప్రశ్న సహజంగానే వస్తుంది. ఐఎన్ఎస్ డేగా కథ ఎక్కడ మొదలైంది? ఇప్పుడు దాని భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?యుద్ధ అవసరాల కోసం నిర్మించిన రన్‌వే... తర్వాత నౌకాదళ గూటిగా మారింది×చీూ డేగా చరిత్ర భారత నౌకాదళంతో కాదు... రెండో ప్రపంచ యుద్ధంతో ప్రారంభమవుతుంది. ఆ సమయంలో భారత తూర్పు తీరంలో సైనిక కార్యకలాపాలకు మద్దతుగా రాయల్ ఎయిర్ ఫోర్స్ నావల్ ఆర్మమెంట్ డిపో సమీపంలో ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించింది. యుద్ధం ముగిసిన తర్వాత ఆ రన్‌వే దాదాపు నిరుపయోగంగా మారిపోయింది. 1962లో పౌర విమానాల కోసం మళ్లీ తెరిచినా ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో సేవలు పలుమార్లు నిలిచిపోయాయి.భారత నౌకాదళం తన వైమానిక విభాగాన్ని విస్తరించే క్రమంలో 1972 డిసెంబరులో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించింది. తొలుత ×చీూ సర్కార్స్ నుంచి హెలికాప్టర్ యూనిట్‌ను నడిపింది. నాలుగేళ్లలో పౌర విమానాశ్రయం పక్కనే హెలిప్యాడ్లు, హ్యాంగర్లు ఏర్పడ్డాయి. 1986లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖ విమానాశ్రయాన్ని అధికారికంగా భారత నౌకాదళానికి అప్పగించింది.భారత పౌర విమానయాన చరిత్రలో ఇది అత్యంత అరుదైన నమూనా. సాధారణంగా సైనిక స్థావరాల్లో పౌర విమానాల కోసం చిన్న ఎన్‌క్లేవ్ ఉంటుంది. విశాఖలో మాత్రం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం నావికాదళ స్థావరం లోపలే నడిచింది. 1991 అక్టోబర్ 21న వైస్ అడ్మిరల్ లక్ష్మీనారాయణ రామ్‌దాస్ దీనిని అధికారికంగా "ఐఎన్ఎస్ డేగా" గా ప్రారంభించారు.డేగా" అంటే మనకు తెలిసిన గద్ద జాతి పక్షే. శక్తి, వేగానికి ప్రతీకగా నిలిచే ఆ పేరు... తర్వాతి కాలంలో హాక్ జెట్లు, కామోవ్ హెలికాప్టర్లు, నిఘా విమానాలకు కేంద్రంగా ఎదిగి ఈ స్థావరానికి సరిగ్గా సరిపోయింది.2000ల దశకం ఐఎన్ఎస్ డేగా రూపురేఖలనే మార్చేసింది. 2007లో 10 వేల అడుగుల కొత్త రన్‌వే అందుబాటులోకి వచ్చింది. వెంటనే రాత్రి వేళల్లో కూడా విమాన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గోవా నుంచి కామోవ్ హెలికాప్టర్లతో కూడిన ఐఎన్ఏఎస్-333 "ఈగిల్స్", తర్వాత హాక్ జెట్ శిక్షణ విమానాలతో ×చీూూ-551 "ది ఫాంటమ్స్" ఇక్కడికి వచ్చాయి. 2009 నాటికి ఐదు నౌకాదళ స్క్వాడ్రన్లు, యుద్ధ నౌకల విమాన యూనిట్లు, నెలకు 550కుపైగా కమర్షియల్ విమానాలు... అన్నీ ఒకే రన్‌వేను పంచుకునే స్థాయికి ఐఎన్ఎస్ డేగా చేరుకుంది.విశాఖ ప్రజలకు ఇది రోజువారీ జీవితంలో భాగమైపోయింది. పైన హాక్ జెట్ గర్జిస్తే అది సాధారణ దృశ్యమే. కానీ ×చీూ డేగా కేవలం విమానాశ్రయం మాత్రమే కాదు. ప్రతి ఏడాది బంగాళాఖాతంలో విరుచుకుపడే తుపాన్లు, వరదల సమయంలో సహాయక చర్యల్లో ముందుండేది. తూర్పు నౌకాదళ కమాండ్ అడ్వెంచర్, స్కైడైవింగ్ కార్యక్రమాలకు కూడా ఇదే కేంద్రంగా నిలిచింది.ఈ ద్వంద్వ వినియోగ వ్యవస్థ విశాఖకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. అయితే అదే కాలక్రమంలో దాని బలహీనతగా కూడా మారింది. మూడు వైపులా కొండలు ఉండటంతో విమానాలు ఒకే దిశలో టేకాఫ్, ల్యాండింగ్ చేయాల్సి వచ్చేది. గంటకు దాదాపు పది విమానాలకే పరిమితి. అదీ కాక పౌర విమానాల షెడ్యూల్ మొత్తం నౌకాదళ శిక్షణ సమయాలకు అనుగుణంగానే ఉండేది. ఇంతలో విశాఖ నగరం విస్తరించింది. ఉక్కు పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, పోర్టు ఆధారిత పెట్టుబడులతో దేశంలో వేగంగా ఎదుగుతున్న నగరంగా మారింది. 1990ల అవసరాలకు సరిపోయే విమానాశ్రయం... 2020ల విశాఖ అవసరాలకు సరిపోలేని పరిస్థితి ఏర్పడింది.ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాదనలకే పరిమితమైన భోగాపురం విమానాశ్రయం చివరకు సాకారమైంది. సుమారు ?4,700 నుంచి ?5,600 కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో జీఎంఆర్ నిర్మించిన "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం", విశాఖకు ఈశాన్యంగా విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో సిద్ధమైంది. 3,800 మీటర్ల రన్‌వేతో భారీ వైడ్‌బాడీ విమానాలు దిగే సామర్థ్యం దీనికి ఉంది. మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా, భవిష్యత్తులో నాలుగు కోట్ల వరకు విస్తరించేలా దీన్ని రూపకల్పన చేశారు. డీజీసీఏ లైసెన్స్, బీసీఏఎస్ భద్రతా అనుమతులు, అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ హోదా... అన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 17 నుంచి దేశీయ, అంతర్జాతీయ కమర్షియల్ విమానాలన్నీ భోగాపురం నుంచే నడవనున్నాయి. విశాఖకు చిరునామాగా ఉన్న"ఘ్జ" ఐఏటీఏ కోడ్ కూడా అక్కడికే మారుతుంది.ఈ మార్పుతో మూతపడేది పౌర ప్రయాణికుల టెర్మినల్ మాత్రమే. నావికాదళ స్థావరం మాత్రం యథావిధిగా కొనసాగుతుంది. సైనిక విమానాలు, నౌకాదళ కార్యకలాపాలు, విపత్తు సహాయక చర్యలు, ప్రభుత్వ ప్రత్యేక విమానాలు, వీఐపీ రాకపోకలు... అన్నింటికీ ఐఎన్ఎస్ డేగా సేవలందిస్తూనే ఉంటుంది. అంతేకాదు, కమర్షియల్ విమానాల ఒత్తిడి తొలగిపోవడంతో విశాఖ గగనతలంపై భారత నౌకాదళానికి పూర్తి నియంత్రణ లభిస్తుంది. ఇప్పటి వరకు పౌర విమానాల షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని చేయాల్సి వచ్చిన అడ్జస్ట్మెంట్లు ఇక అవసరం ఉండవు. శిక్షణ విమానాలు పెంచడం, నౌకాదళ కార్యకలాపాలను విస్తరించడం, అత్యవసర పరిస్థితుల్లో మరింత వేగంగా స్పందించడం... ఇవన్నీ మరింత సులభమవుతాయి.

## తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనే ఓట్లు మిస్

ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో ఏకంగా 44.89 లక్షల ఓటర్లు అంటే సుమారు 10.8 శాతం ఓటర్ల పేర్లను అధికారులు ముసాయిదా జాబితాలో అన్ కలెక్టబుల్ కేటగిరీ కింద తొలగించేందుకు సిద్ధం చేశారు. జులై 31న విడుదలైన ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.71 కోట్లకు పడిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర అలజడి రేపుతోంది.ఈ భారీ ఓట్ల గల్లంతు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. 15.22 లక్షల మంది మరణించిన వారు కాగా, 22.99 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారు లేదా ఫారమ్‌లు సమర్పించని అన్ కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నారు. మరో 7.37 లక్షల ఓట్లను ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డూప్లికేట్ ఓట్లుగా అధికారులు వర్గీకరించారు. ముఖ్యంగా రాయలసీమ , కోస్తా జిల్లాల్లో ఓట్ల రద్దు అత్యధికంగా నమోదైంది. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.91 లక్షల ఓట్లు, తిరుపతి జిల్లాలో 2.88 లక్షలు, కర్నూలులో 2.74 లక్షలు, అనంతపురంలో 2.48 లక్షలు, వైఎస్సార్ కడపలో 2.45 లక్షలు, విశాఖపట్నంలో 2.39 లక్షల ఓట్లు తొలగింపు లిస్టులోకి వెళ్లాయి.ఈ భారీ ప్రక్రియ వెనుక అసలేం జరుగుతోంది.. వీరంతా ఎటు పోయారనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తి రేపుతోంది. ఉపాధి, విద్య, వ్యాపార రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లేదా ఇతర నగరాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు క్షేత్రస్థాయి రీ-వెరిఫికేషన్ సమయంలో లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయ నష్ట కోణంలో చూస్తే, ఈ ఓట్ల గల్లంతు ప్రభావం రెండు ప్రధాన పార్టీలపై పడే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ సొంత ఊళ్లకు వచ్చి ఓటేసే మైగ్రెంట్ ఓటర్లు వైఎస్సార్‌సీపీ లేదా టీడీపీ మద్దతుదారులనే లెక్కలు పార్టీల వద్ద ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తమ మద్దతుదారుల పేర్లు పొరపాటున ఈ 44 లక్షల జాబితాలో చేరాయేమోనని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల వేళ ఈ ఓట్ల వ్యత్యాసం గెలుపోటములను శాసించే స్థాయిలో ఉంది.ఎన్నికల సంఘం, సీఈఓ వివేక్ యాదవ్ స్పష్టం చేసిన దాని ప్రకారం, ఇది కేవలం ముసాయిదా మాత్రమే. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు హక్కునూ నోటీసు, విచారణ లేకుండా తొలగించబోమని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆగస్టు నెల అంతా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నడుస్తోంది. తమ పేరు పొరపాటున గల్లంతైతే ఫారమ్-6 సమర్పించి, సరైన ఆధారాలు చూపిస్తే అక్టోబర్ 3న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో మళ్లీ పేరు చేరుతుందని ఈసీ వెల్లడించింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో గ్రామీణ మరియు పట్టణ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను అలర్ట్ చేసిన కూటమి, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి నియోజకవర్గంలో రద్దయిన ఓట్ల జాబితాను రీ-వెరిఫై చేసే పనిలో పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ విలువైనదే అయినందున, అసలైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చూసేందుకు పొలిటికల్ పార్టీలు డిజిటల్ క్యాంపెయిన్లు, డోర్-టు-డోర్ వెరిఫికేషన్లను ముమ్మరం చేశాయి.

## అనగానికి రాజకీయ ఇబ్బందులు

తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రధాన అనుచరుడు గూడపాటి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరడం ఒకరకంగా సాక్ అని చెప్పాలి. మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె నియోజకవర్గంలో స్థానిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన పార్టీని వీడుతూ, వైసీపీ కాంగ్రెస్ పార్టీ అధినేతను కలిసి త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. రేపల్లె టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు పార్టీ వీడటం కేవలం తన వ్యక్తిగత కారణాలరీత్యా రాజీనామా చేశానని చెప్పారు. అనగాని సత్యప్రసాద్ వరసగా మూడు సార్లు రేపల్లె నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 2014లో తొలిసారి గెలిచిన అనగాని సత్యప్రసాద్ తర్వాత 2019, 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ విక్టరీని కొట్టారు. ఈ విజయం వెనక గూడపాటి కష్టం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టారు. రేపల్లె నియోజకవర్గంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువయిందని, పార్టీ కోసం, ఆయన గెలుపు కోసం పనిచేసిన వారిని మంత్రి అయిన తర్వాత పట్టించుకోవడం లేదని గూడపాటి శ్రీనివాసరావు అనుచరులు చెబుతున్నారు. కానీ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు గూడపాటి హుందాగా చెప్పడం విశేషం. ఇక రంజుగా రాజకీయం వైసీపీ కండువా కప్పుకుని... తాజాగా రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ సమక్షంలో రేపల్లె నియోజకవర్గ టీడీపీ నేత, కాపు నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు, అనుచరులు టీడీపీలో చేరారు. జగన్ గూడపాటి శ్రీనివాసరావును పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గతంలో గూడపాటి శ్రీనివాసరావు రేపల్లె నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్నారు. రేపల్లెలో పార్టీ విజయం కోసం గూడపాటి శ్రీనివాసరావు పనిచేస్తారని, వచ్చే ఎన్నికల్లో మోహన్ కు మద్దతుగా ప్రకటిస్తారని తెలిపారు. దీంతో రేపల్లె నియోజకవర్గంలోని వైసీపీలో జోష్ పెరిగింది. వచ్చే ఎన్నికల్లో రేపల్లెలో విజయం సాధించడానికి తన వంతు కృషి చేస్తానని, గూడపాటి శ్రీనివాసరావు చెప్పారు. కాపు సామాజికవర్గం నేత వైసీపీలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో ఒకింత సంతోషం వ్యక్తమవుతుంది.

## ఎలా ఎదిగాడో...దానికి డబుల్ స్పీడ్ లో...

## దిగజారిన ఉదయ్ కృష్ణారెడ్డి

ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కష్టపడి పైకి వచ్చారు. ఎంత వేగంగా ఎదిగారో.. అంతే స్పీడ్ గా పతనమయ్యారు. ఒక బలహీనత ఆయన కెరీర్ ను ప్రమాదంలోకి నెట్టేసింది. మహిళలతో సంబంధాల కోసం ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ ఉద్యోగానికే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు పోలీసుల విచారణతో వెదలయింది. ట్రెయినీ మహిళ ఐపీఎస్ తో మాత్రమే కాకుండా మరో మహిళతోనూ వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడయింది. తమ ప్రాంతానికి చెందిన మహిళ హైదరాబాద్ లో ఉండటం, ఆమెను లోబర్చుకున్నారన్న ఆరోపణలు ఉదయ్ కృష్ణారెడ్డిపై వినిపిస్తున్నాయి.... ట్రయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో కీలక పురోగతి కనిపిస్తుంది. ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో కత్తి, రెండు ప్రేమలేఖలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వివాహితతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. బాధితురాలిని కలిసిన తర్వాత ఉదయ్‌కు వివాహిత దూరమైనట్లు కూడా కనుగొన్నారు. తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల కేసులో అరెస్టయిన ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో సాగుతున్న విచారణలో నిందితుడి విపరీత ప్రవర్తన, ఇతర సంబంధాలపై కీలక ఆధారాలు లభ్యమయ్యాయి... కేసులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు.

# రూ.3.25లక్షల కోట్లతో 114 రఫేల్ యుద్ధ విమానాలు



భారత వైమానిక దళం సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. 114 రఫేల్ మల్టీ రోల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. దాదాపు రూ. 3.25 లక్షల కోట్ల విలువైన ఈ మెగా డీల్‌పై ఫ్రాన్స్ నుంచి ఎట్టకేలకు స్పందన వచ్చింది. భారత్‌కు తాజాగా దీనిపై సమగ్ర సాంకేతిక, వాణిజ్య ప్రతిపాదనను (టెక్నికల్ అండ్ కమర్షియల్ ప్రపోజల్) సమర్పించింది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత వైమానిక దళానికి చెందిన అక్విజిషన్ వింగ్ ప్రస్తుతం ఈ ప్రపోజల్‌ను నిశితంగా పరిశీలిస్తున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత్ ఈ ఏడాది మే నెలలో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ రిక్వెస్ట్‌ను ఫ్రాన్స్‌కు పంపింది. దానికి ప్రతిస్పందనగానే ఆ దేశం ఇప్పుడు తమ పూర్తి ప్రతిపాదనను పంపింది. ఇందులో విమానాల తయారీ, సాంకేతిక పరిజ్ఞానం, స్వదేశీకరణ అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలోని మొత్తం 114 రఫేల్ ఫైటర్ జెట్లలో 94 విమానాల్ని భారత్‌లోనే స్థానిక భాగస్వాములతో కలిసి తయారు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల పలు ప్రముఖ భారతీయ కంపెనీలకు పెద్ద మొత్తంలో వ్యాపార అవకాశాలు దక్కనున్నాయి.

**మేక్ ఇన్ ఇండియాకు మరింత ఊతం**

ఈ ప్రతిపాదనలో అత్యంత కీలకమైన అంశం స్థానికంగా తయారీ. ఇది మేక్ ఇన్ ఇండియాకు మరింత ఊతం అందించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒప్పందం కింద 94 రఫేల్ యుద్ధ విమానాల్ని భారత్‌లో తయారు చేయాలి. ఇక్కడ ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, మిస్సైల్ తయారీ సంస్థ వీదీణూ, ఇంజిన్ తయారీదారు సఫ్రాన్, రాడార్, ఎలక్ట్రానిక్స్ రంగంలోని థేల్స్ సంయుక్తంగా భారతీయ భాగస్వామ్య సంస్థలతో కలిసి పనిచేస్తాయి. ఈ ప్రాజెక్టు ద్వారా భారత పరిశ్రమలకు భారీ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా టాటా, లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ– ాడు) సహా పలు భారతీయ కంపెనీలకు రూ. 1.6 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి, సరఫరా వ్యాపార అవకాశాలు వస్తాయని అంచనా. ఇంకా ఈ ఒప్పందంలో భారత్ అభివృద్ధి చేసిన అస్త్ర (ూార్తీఖ) గగనతల క్షిపణుల అనుసంధానం, అలానే స్వదేశీ పరికరాల వినియోగంపై కూడా భారత్ ప్రత్యేకంగా డిమాండ్ చేసింది. మరి ఫ్రాన్స్ పంపిన ప్రతిపాదనలో ఈ అంశాలకు సంబంధించి ఎలాంటి వివరణ ఇచ్చిందోననే విషయాన్ని భారత అధికారులు పరిశీలిస్తున్నారు.

**తగ్గుతున్న మిగ్ యుద్ధ విమానాలు– రఫేల్ తప్పనిసరి!**

ప్రస్తుత భారత వైమానిక దళం వద్ద ఉన్న రష్యాకు చెందినటువంటి పాత మిగ్ (వీఅ+) యుద్ధ విమానాల్ని దశల వారీగా సేవల నుంచి తప్పిస్తున్నారు. మరోవైపు ఇదే సమయంలో స్వదేశీ ాజూ మీుతీఎ– 1ూ, ాజూ మార్క్–2 విమానాల్ని తీసుకురావడంలో ఆలస్యమవుతోంది. వీటి ఉత్పత్తి, సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కొత్త యుద్ధ విమానాల అవసరం అనివార్యంగా మారింది.

ఇప్పటికే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (వైమానిక దళం), నేవీ ఫోర్స్ (నౌకా దళం) కలిపి 62 రఫేల్ యుద్ధ విమానాల కోసం ఆర్డర్ ఇచ్చాయి. తాజా 114 రఫేల్ ఫైటర్ జెట్ల డీల్ కూడా అమలైతే దేశంలోని రఫేల్ విమానాల సంఖ్య ఏకంగా 176 కు చేరుతుంది. అదనంగా సముద్ర మార్గ ముప్పుల్ని ఎదుర్కొనేందుకు మరో 31 రఫేల్ మెరైన్ విమానాల్ని కొనుగోలు చేయాలని భారత నౌకాదళం ఇప్పటికే తమ నుంచి ప్రతిపాదన పంపింది. దీనికి కూడా ఆమోదం లభిస్తే దేశంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 200 దాటే అవకాశం ఉందని చెప్పొచ్చు. రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలో భారత వైమానిక దళం సామర్థ్యాల పెంపుపై చేపట్టిన సమీక్ష తర్వాత ఈ రఫేల్ ప్రాజెక్టు వేగవంతం అయింది. దాదాపు 5 నెలల కిందటే డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (ణాాజ) కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇప్పుడు ఫ్రాన్స్ సమర్పించిన ప్రతిపాదనపై భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ మెగా డిఫెన్స్ డీల్ తదుపరి దశకు వెళ్లనుంది.

# యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్



ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ ఎలాంటి చర్చ లేకుండానే గురువారం పలు బిల్లులను ఆమోదించింది. ముఖ్యంగా యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఛార్జీలు విధించే అధికారం బ్యాంకులకు ఇచ్చేందుకు తీసుకువచ్చిన పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్–2007 చట్ట సవరణను లోక్‌సభ ఆమోదించింది. అనంతరం శుక్రవారానికి వాయిదాపడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అయోధ్య రామమందిరంలో కానుకల చోరీ, విద్యార్థులపై పోలీసు చర్య అంశాలపై హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విపక్షాల నినాదాలతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టకుండానే స్పీకర్ సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా సభలో అదే పరిస్థితి కొనసాగింది.

ఈ క్రమంలోనే ఖూ×సహా ఇతర నోటిఫైడ్ డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బిల్లును విపక్షాల నినాదాల మధ్యే ఎలాంటి చర్చ లేకుండా మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. 2007నాటి పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టాన్ని సవరించారు. యూపీఐ, రూపే డెబిట్ కార్డుతో చేసే డిజిటల్ చెల్లింపులపై వీణ= ఛార్జీలు విధించకుండా ఉన్న నిబంధనను తొలగించారు. ఇకపై ఏ డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు ఉండాలో కేంద్రమే నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించనుంది. డిజిటల్ పేమెంట్ వ్యవస్థను నడిపే బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదాయం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం బిల్లులో సవరణలు చేసింది.

**ట్యాక్సేషన్, ఇతర చట్టసవరణ బిల్లును కూడా లోక్‌సభ ఆమోదం**

ఆ తర్వాత ట్యాక్సేషన్, ఇతర చట్టసవరణ బిల్లును కూడా లోక్‌సభ ఆమోదం తెలిపింది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు భారత్?లో ఎలక్ట్రానిక్స్ వస్తువులను ఉత్పత్తి చేయడానికి కాంట్రాక్ట్ తయారీదారుని నియమించుకునే విదేశీ కంపెనీలకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆదాయపు పన్ను మినహాయింపును ఈ బిల్లు 2040–41 వరకు పొడిగిస్తుంది. ఈ బిల్లులో పేర్కొన్న నిర్దిష్ట ఎలక్ట్రానిక్ వస్తువుల్లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పర్సనల్ కంప్యూటర్లు, టాబ్లెట్‌లు, సర్వర్లు వాటి కీలక భాగాలు, అనుబంధ పరికరాలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలకు విడిభాగాల సరఫరాకు మద్దతుగా, కస్టమ్స్ గిడ్డంగుల్లో విడిభాగాలను నిల్వ చేసి, వాటిని భారత్?లోని కాంట్రాక్ట్ తయారీదారుకు సరఫరా చేసే విదేశీ కంపెనీలకు 2040–41 వరకు 15 సంవత్సరాల పాటు ఆదాయపు పన్ను (ఐటీ) మినహాయింపును ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

ఇంకా భారతీయ దేటా సెంటర్లను ఉపయోగించే విదేశీ క్లౌడ్ కంపెనీలకు ఉన్న అనుమతి, నోటిఫికేషన్ అవసరాలను కూడా ఈ బిల్లు తొలగిస్తుంది. భారతీయ దేటా సెంటర్లను కేవలం ప్రత్యక్ష యాజమాన్యం కింద కాకుండా, లీజు ప్రాతిపదికన నిర్వహించాలని కూడా ఇది ప్రతిపాదిస్తోంది. ప్రపంచ పెట్టుబడులు, తయారీ, వ్యాపారాలు భారతదేశానికి వచ్చి స్థిరపడటానికి మరింత ఆకర్షణీయమైన ప్రదేశంగా మార్చడమే ఈ బిల్లులోని ప్రతిపాదనల ఏకైక లక్ష్యమని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో ఆమోదం పొందిన ఏడో బిల్లు ఇది. అయితే, ఎలాంటి చర్చ లేకుండా ఆమోదం పొందిన ఐదో బిల్లు ఇది. పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని సవరించే బిల్లుపై సభ 10 గంటల పాటు చర్చించి ఆమోదించింది. అటు జాతీయ గేయం 'వందేమాతరం'ను అవమానించడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించే బిల్లుపై ఇద్దరు సభ్యులు పాల్గొనగా, దానిపై క్లుప్తంగా చర్చ జరిగిన తర్వాత ఆమోదించింది.

## ప్రధాని మోదీకి ఫోన్ చేసిన ఇజ్రాయెల్ ప్రధాని

**ఇరుదేశాల పురోగతిపై చర్చ**

**ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతంపై చర్చలు**

**పశ్చిమాసియాలోని పరిణామాలపై ఆరా**

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఒక కీలక పరిణామం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. పశ్చిమాసియాలోని ప్రస్తుత పరిణామాలపై నెతన్యాహుతో మోదీతో చర్చించారు. మోదీకి ఫోన్ చేసిన నెతన్యాహు ఇరుదేశాల ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేలా చర్చలు జరిపారు. భారత్– ఇజ్రాయెల్ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన స్థిరమైన ప్రగతిని నేతలు సమీక్షించారు.

రెండు దేశాల పరస్పర ప్రయోజనాల కోసం వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతానికి కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించారు. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నుంచి తనకు ఫోన్?కాల్? వచ్చినట్లు మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఆ కాల్ సంభాషణలో ఇరుదేశాల మధ్య సంబంధించిన పురోగతిపై సమీక్షించామని తెలిపారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులపై అభిప్రాయాలను పంచుకున్నామని చెప్పారు.

కాగా, భారత్, ఇజ్రాయెల్ దేశాలు పలు కీలక రంగాల్లో తమ సహకారాన్ని విస్తరిస్తూనే వస్తున్నాయి. ఇటీవల జూలై ప్రారంభంలో, ఇరు దేశాలు ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఖీూా) కోసం రెండో విడత చర్చలను ముగించాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో పరస్పర సమగ్రమైన ఒప్పందాన్ని త్వరగా ముగించే దిశగా కృషి చేస్తామని పునరుద్ఘాటించాయి. పశ్చిమాసియాలో సంఘర్షణ ఉన్నప్పటికీ భారత్–ఇజ్రాయెల్ సంబంధాలు అద్భుతమైన పథంలో కొనసాగుతున్నాయని భారత్?లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ కొద్దిరోజుల క్రితం పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సంఘర్షణ ఉన్నప్పటికీ, రక్షణ, మౌలిక సదుపాయాలు, ఆర్థిక, వాణిజ్య రంగాల్లో భారత్?తో విస్తరిస్తున్న సహకారమే ఈ పథానికి కారణమని అజార్ పేర్కొన్నారు. గత మూడేళ్లుగా ద్వైపాక్షిక భాగస్వామ్యం బలోపేతం అవుతూనే ఉందని, ఇరు దేశాలు పలు రంగాల్లో తమ సంబంధాలను మరింతగా పెంచుకుంటున్నాయని ఆయన తెలిపారు. భారత్–ఇజ్రాయెల్ దేశాల మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో అత్యున్నత స్థాయి ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపాంతరం చెందాయి. 1950లో భారతదేశం ఇజ్రాయెల్‌ను గుర్తించినప్పటికీ, 1992లోనే ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. నాటి నుండి నేటి వరకు రక్షణ, సాంకేతికత, వ్యవసాయ రంగాల్లో ఈ బంధం విపరీతంగా బలపడింది. 2026 ఫిబ్రవరి 25–26 తేదీలలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో అధికారిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాల బంధాన్ని శాంతి, ఆవిష్కరణలు, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచారు. ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ, ప్రపంచంలో తమకున్న అత్యంత సన్నిహిత మిత్రులలో ప్రధాని మోదీ ఒకరని కొనియాడారు. అంతర్జాతీయంగా ఇజ్రాయెల్‌కు భారత్ అందిస్తున్న మద్దతు ఎంతో విలువైనదని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులు మరోసారి రెచ్చిపోయారు. యెమెన్‌లోని సైనిక శిబిరాలపై హూతీ రెబల్స్ భారీ దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో 30 మంది జవాన్ల ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందిపైగా సైనికులు గాయపడ్డారు.

## రైతుల కోసం కేంద్రం

## రూ.23,731 కోట్ల 'గోబర్‌ధన్' పథకం

వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్‌ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. 2026–27 నుంచి 2035–36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి. సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది. కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది. సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్..

భారత్ డేటా సెంటర్ రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. విశాఖపట్నం భారీ స్థాయి కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆకర్షణీయ గమ్యంగా మారుతోంది. ఈ విషయాలు నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడయ్యాయి. ప్రపంచంలోని 36 ప్రధాన డేటా సెంటర్ మార్కెట్లపై నిర్వహించిన అధ్యయనంలో ముంబయి ఆపరేషనల్ సామర్థ్యం పరంగా 15వ స్థానంలో నిలిచింది. అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితాలో 11వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ ప్రస్తుతం 151 మెగావాట్ల సామర్థ్యంతో 27వ స్థానంలో ఉన్నా, 2.2 గిగావాట్లకు పైగా అభివృద్ధి ప్రణాళికలతో 19వ స్థానంలో నిలిచి వేగంగా విస్తరిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది. చెన్నై ఆగ్నేయాసియా ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు కీలక కేంద్రంగా బలపడుతుండగా, బెంగళూరు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన సంస్థల పెట్టుబడులను ఆకర్షిస్తోంది. మరోవైపు పూణె, ఢిల్లీ ఎన్‌సీటీ ప్రాంతంలో కూడా డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతోంది. రెండో శ్రేణి నగరాల్లో విశాఖపట్నం, జామ్‌నగర్ భారీ గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీ ప్రణాళికలు ఇందుకు దోహదపడుతున్నాయని వెల్లడించింది. క్లౌడ్ సేవల వినియోగం పెరగడం, కృత్రిమ మేధ వినియోగం విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడం వల్ల భారత్‌లో డేటా సెంటర్లకు డిమాండ్ మరింత పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ ఇండియా అభిప్రాయపడింది. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన అనుమతులు ఉంటే రానున్న దశాబ్దంలో భారత్ ప్రపంచంలోనే కీలక డేటా సెంటర్ల కేంద్రంగా ఎదిగే అవకాశముందని పేర్కొంది.

## జేఈఈ తరహాలో నీట్




దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్–యూజీ పరీక్ష నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఉన్న పెన్– అండ్–పేపర్ విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షగా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఎన్టీఏ స్థానంలో స్వతంత్ర, బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న పిటిషన్లపై జస్టిస్ పి.ఎస్. నరసింహా, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో నీట్–యూజీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహణపై సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్రం పలు విషయాలను ప్రస్తావించింది. జేఈఈ తరహాలో నీట్ నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. నందన్ నీలేకని అధ్యక్షతన ఏర్పాటైన హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగానే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. కంప్యూటర్ ఆధారిత విధానంలోకి మారితే దానిని వీలైనంత త్వరగా అమలు చేయాలని వైద్యుల సంఘం తరఫున పిటిషనర్లు కోర్టును కోరారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు. అయితే కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై సమాధానం ఇవ్వాలని వైద్యుల సంఘంతో సహా పిటిషనర్లను సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

**హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగానే తుది నిర్ణయమన్న కేంద్రం**

"నీట్ ఖ+ విషయంలో పెన్ –పేపర్ విధానం నుంచి కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే అంశంపై ప్రస్తుతం సంబంధిత వర్గాలన్నీ చురుగ్గా పరిశీలన జరుపుతున్నాయి. ఇది జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (మెయిన్స్ –అడ్వాన్స్‌డ్ తరహాలో ఒకే దశలో లేదా రెండు దశల్లో ఉండవచ్చు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది విధానాన్ని అనుసరిస్తాం. సాంకేతికత, అంతరిక్షం, ఇంటెలిజెన్స్, విద్యా రంగం, ప్రజా పరిపాలన వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన నిపుణులతో కూడిన ఈ టాస్క్ ఫోర్స్, విధాన మార్పునకు సంబంధించిన సాంకేతిక, భద్రతా, సమానత్వ, మౌలిక సదుపాయాలు, బోధనాపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తుంది." అని కేంద్రం అఫిడవిట్?లో పేర్కొంది.

ప్రశ్నపత్రాల లీకులు, వ్యవస్థాగత వైఫల్యాలను నిర్మూలించేందుకు జాతీయ అర్హత–ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. ప్రశ్నాపత్రాల లీకులు, నకిలీ గుర్తింపు, కంప్యూటర్ వ్యవస్థలను తారుమారు చేయడం, ఇతర పరీక్షా సంబంధిత నేరాలను నేరంగా పరిగణించే 2024 చట్టాన్ని విస్తరిస్తూ, పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం– 2026 తీసుకువచ్చామని కేంద్రం చెప్పింది. ఈ చట్టం ద్వారా పరీక్షల మోసానికి వ్యతిరేకంగా పార్లమెంటు చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేసిందని కేంద్రం తెలిపింది.

**ముందే స్పష్టత ఇవ్వాలని ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేసిన వైద్యుల సంఘం**

అటు ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తరఫున న్యాయవాది తన్వి దూబే ధర్మాసనానం ఎదుట హాజరయ్యారు. ఒకవేళ కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే ప్రణాళిక ఉంటే, అది వీలైనంత త్వరగా జరగాలని ఆమె కోరారు. ఎందుకంటే ప్రస్తుతం విద్యార్థుల సన్నద్ధత పెన్– పేపర్ విధానం ఆధారంగానే సాగుతోందని తెలిపారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన ధర్మాసనం, సంబంధిత పక్షాలను తమ సమాధానాలు, సూచనలను దాఖలు చేయాలని చెప్పింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూా)లో సంస్కరణలు కోరుతూ =జీణ ఎంపీ సుధాకర్ సింగ్ తరఫున సీనియర్ న్యాయవాది పిజూష్ కాంతి రాయ్, న్యాయవాది సత్యం సింగ్ రాజ్‌పుత్ హాజరయ్యారు.

# వాతావరణ వారధి!

ఈ ఏడాది భారత్‌లో ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయి. అయితే వర్షాలు కురిసినప్పుడు మాత్రం అత్యంత తీవ్రస్థాయిలో కురిశాయి. ముంబయి, సూరత్‌వంటి నగరాల్లో కొద్దిరోజుల వ్యవధిలోనే నెల మొత్తానికి సరిపడా వర్షపాతం నమోదైంది. అస్సాం, ఒడిశా రాష్ట్రాల్లో తీవ్రమైన వరదలు సంభవించి, ప్రాణనష్టంతోపాటు మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇలాంటి పరిస్థితులే చైనాలోని గ్వాంగ్జీ, షాన్‌షీ, గన్సువంటి పలు ప్రావిన్సుల్లోనూ ఇటీవల కనిపించాయి. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన ఈ రెండు దేశాల్లో, ఇలాంటి తీవ్ర వాతావరణ పరిణామాలు రోజురోజుకూ సాధారణమైపోతూ, ఆర్థిక వృద్ధిని, ఆహార భద్రతను, ప్రజా సంక్షేమాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయి.

వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడం, సముద్రాలు వేగంగా వేడెక్కడంవల్లే ఇలాంటి స్వల్పకాలిక, తీవ్రస్థాయి వర్షపాత ఘటనలు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ సవాలు స్థాయిని చూస్తే, వాతావరణ స్థితిస్థాపకత అనే అంశం భారత్–చైనా సహకారానికి కొత్త వేదికగా మారే అవకాశం ఉందా? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. వేగవంతమైన పట్టణీకరణ, చిత్తడి నేలలు, అడవులు, నీటిని ఇంకించుకునే భూతలాలు కాంక్రీటుగా మారిపోవడం –ఈ రెండు దేశాలూ దాదాపు ఒకే రకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. మారుతున్న వాతావరణ సరళి, పాతబడిన డ్రైనేజీ వ్యవస్థలు, సరైన వ్యర్థాల నిర్వహణ లేకపోవడం, పచ్చదనం కొరత వంటివి కలిసి, నీటి నిల్వ, వరదల సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. తీరప్రాంత మహా నగరాలు తీవ్ర వర్షపాతం, తుపాను ఉప్పెనలు, సముద్ర మట్టం పెరుగుదల వంటి కలగలిపిన ముప్పులను ఎదుర్కొంటుండగా, లోతట్టు నగరాలు వేడిగాలులు, కరవు, ఆకస్మిక వరదలను వరుసగా ఎదుర్కొంటున్నాయి.


ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు శాస్త్రీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణలు, బలమైన స్థానిక పాలన, ప్రజల భాగస్వామ్యం అవసరం. ఏమీ చేయకుండా ఉంటే సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఆర్థిక నష్టాలు, ఉత్పాదకత క్షీణత, ప్రజారోగ్య ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ఏళ్లుగా దెబ్బతిన్న సంబంధాల నేపథ్యంలో, భారత్–చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు నెమ్మదిగానైనా మెరుగుపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. 2026 ఏప్రిల్‌లో చైనా వాతావరణ మార్పులపై ప్రత్యేక రాయబారి నేతృత్వంలోని బృందం న్యూఢిల్లీని సందర్శించడం, వాతావరణ సహకారం ఇప్పటికీ ప్రాధాన్యతా అంశంగా ఉందని సూచిస్తోంది. హరిత సాంకేతికత, క్లిష్టమైన ఖనిజాలవంటి రంగాల్లో సహకారం ఆర్థిక పోటీ, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతల కారణంగా సవాలుగానే మిగిలింది. అయితే, విపత్తు నివారణ, పట్టణ స్థితిస్థాపకత వంటి రంగాలు, నమ్మకాన్ని పునర్నిర్మించుకునేందుకు తక్కువ ప్రమాదకరమైన మార్గాన్ని అందించగలవు. సెంటర్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ప్రోగ్రెస్ (సీఎస్ఈపీ) ఇటీవల విడుదల చేసిన ఒక పత్రం ప్రకారం, భారత్–చైనా వాతావరణ సహకారానికి గత చరిత్రలో పూర్వాపరాలు ఉన్నాయి. 1990ల ప్రారంభం నుంచి 2020 వరకూ, వాతావరణ మార్పులపై ఆచరణాత్మక సహకారం కోరుతూ అనేక శిఖరాగ్ర స్థాయి ఉమ్మడి ప్రకటనలు, ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. వరదలు, భూకంపాలు, కరవువంటి వాతావరణ ప్రేరిత విపత్తులపై ఉమ్మడి పరిశోధన, జల, సముద్ర, భూకంప సంబంధిత డేటా పంచుకోవడం, పాలనా విధానాల మార్పిడి వంటివి ఈ ఒప్పందాల్లో భాగంగా ఉన్నాయి. ఢిల్లీ–బీజింగ్, ముంబై–షాంఘై, చెన్నై–చాంగ్‌కింగ్ నగరాల మధ్య కుదిరిన సోదర నగరాల ఒప్పందాల ద్వారా, ఈ రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల ఆచరణాత్మక అమలుకు అధికారికంగా అంగీకారం కుదిరింది. అయితే, దౌత్యపరమైన సంబంధాల్లో ఏర్పడిన అంతరాయాల కారణంగా, క్షేత్రస్థాయిలో ఆచరణ మాత్రం స్వల్పంగానే మిగిలింది.

పట్టణ, గ్రామీణ ప్రణాళిక, పెట్టుబడి నిర్ణయాల్లో స్థితిస్థాపకతను ప్రధాన అంశంగా చేర్చడం ఎంత ముఖ్యమో చైనా అనుభవం చూపిస్తోంది. రవాణా, గృహనిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల్లో డేటా ఆధారిత విధానాలను వినియోగించడం ఇందులో భాగం. మరోవైపు, భారత్ బలం అనుకూల పాలనలో ఉంది. బలహీన

## సంపాదకీయం

వర్గాలకు లక్ష్యిత జోక్యాల కోసం సమాజ–నేతృత్వ వ్యూహాలను ముందుండి నడిపించడంలో భారత్ ముందంజలో ఉంది. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, హీట్ యాక్షన్ ప్లాన్లు, కూల్ రూఫ్‌లు, ప్రకృతి ఆధారిత పరిష్కారాల్లో భారత్ విజయాలు సాధించింది. అహ్మదాబాద్ హీట్ యాక్షన్ ప్లాన్, చెన్నై వాటర్ రెసిలియెన్స్ స్ట్రాటజీ, ముంబయి క్లైమేట్ యాక్షన్ ప్లాన్ వంటివి ఇందుకు నిదర్శనం. మున్సిపల్ ప్రభుత్వాల అధికారులు, స్పాంజ్ సిటీలు, డ్రైనేజీ ఆధునికీకరణ, వ్యర్థాల నిర్వహణ వంటి పట్టణ డిజైన్ అంశాలపై విజ్ఞాన, విధాన మార్పిడికి దోహదపడగలరు. పట్టణ సమస్యలకే పరిమితం కాకుండా, గ్రామీణ జీవనోపాధి, ఆహార భద్రత కోసం స్థితిస్థాపక వ్యవసాయ పద్ధతులు కూడా పరస్పర అభ్యసనానికి కీలక అంశాలుగా మారనున్నాయి. ఇరు దేశాలు పంచుకుంటున్న హిమాలయ పర్యావరణ వ్యవస్థలో మంచు కరుగుతున్న సమస్యను పరిష్కరించడం అత్యంత కీలకమైన అంశంగా మిగిలింది. నీటి వనరుల విషయంలో గతంలో ఒప్పందాలు కుదిరినా, 2022లో అవి నిలిచిపోయాయి. వాతావరణ అనుకూలనకు ప్రధాన అడ్డంకిగా నిధుల కొరత మిగిలిపోయింది. రెండు దేశాలూ తమ విధానాల అమలుకు ప్రధానంగా ప్రభుత్వ నిధులపైనే ఆధారపడుతున్నాయి. ఈ అంతరాన్ని పూడ్చేందుకు, బ్లెండెడ్ ఫైనాన్స్, మున్సిపల్ బాండ్లు, క్రెడిట్ ఎన్‌హాన్స్‌మెంట్ వంటి సాధనాల ద్వారా ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సహకారం ఇరు దేశాలకే కాకుండా, గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా బలమైన ప్రమాణాలు, కొలమానాలు, ఆర్థిక వ్యవస్థల ద్వారా వాతావరణ స్థితిస్థాపక నిబంధనలను రూపొందించే అవకాశాన్ని కల్పిస్తుంది. వాతావరణ మార్పు ప్రభావం జాతీయ సరిహద్దులను దాటి విస్తరిస్తోంది. ఐరోపా వేడిగాలుల నుంచి ఆసియా భారీ రుతుపవన వరదల వరకూ ఇది కనిపిస్తోంది. మరింత సమన్వయం, సహకారం, భారత్–చైనాలకు తక్కువ ప్రమాదంతో కూడిన, ఇరు దేశాలకూ లబ్ధి చేకూర్చే సహకార మార్గాన్ని అందించగలవు!

## పనికొచ్చే పలుకు



# ఆ భ్రమలనుంచి బయటపడితేనే..

మన గెలుపు, ఓటముల గురించి ఆలోచించే తీరిక చుట్టూ ఉన్న ప్రపంచానికి ఏమాత్రం లేదు. ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాల్లో, తమ సమస్యల్లో నిమగ్నమై ఉంటారు. మనం చేసే తప్పులను, మనం అనుభవించే వైఫల్యాలను ఎవరో నిశితంగా గమనిస్తున్నారన్న భావన, వాస్తవానికి మన మనసు సృష్టించుకున్న ఒక భ్రమ మాత్రమే. ఈ నిజాన్ని గుర్తించినప్పుడే, మనిషి తనలోని అసలైన శక్తిని బయటకు తీసుకురాగలడు.

"ప్రజలు ఏమనుకుంటారో" అనే భయం మనిషిని అడుగడుగునా వెనక్కి లాగుతుంది. కొత్త ప్రయత్నం చేయాలన్నా, భిన్నమైన మార్గంలో నడవాలన్నా, "విఫలమైతే అందరూ నవ్వుతారు" అనే ఆలోచనే మొదటి అడ్డంకిగా నిలుస్తుంది. కానీ వాస్తవం ఏమిటంటే, ఎవరూ మన వైఫల్యాన్ని అంతగా పట్టించుకోరు, ఎందుకంటే ప్రతి ఒక్కరూ తమ సొంత జీవితపు పోరాటాల్లో మునిగి ఉంటారు. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్న క్షణం నుంచే, మనిషి స్వేచ్ఛగా, ధైర్యంగా ముందడుగు వేయగలుగుతాడు.

ఈ మార్పు జీవనశైలిపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. ప్రపంచం చూస్తోందన్న భయం తగ్గినప్పుడు, కొత్త విషయాలు నేర్చుకోవడానికి, కొత్త రంగాల్లోకి అడుగుపెట్టడానికి మనసు సిద్ధమవుతుంది. వైఫల్యాన్ని ఒక ముగింపుగా కాకుండా, ఒక పాఠంగా చూసే దృక్పథం అలవడుతుంది. ఒక ప్రాజెక్టు విఫలమైనా, ఒక పరీక్షలో తప్పినా, ఒక వ్యాపారం నష్టపోయినా – అవన్నీ చివరి అధ్యాయాలు కావు, కొత్త ప్రయాణానికి పునాదులు మాత్రమే. ఈ అవగాహన కలిగినప్పుడు, ప్రతి పతనం తర్వాత లేచి నిలబడే శక్తి దానంతట అదే వస్తుంది. పని పట్ల నిమగ్నత పెరుగుతుంది, ఎందుకంటే బయటి అభిప్రాయాలపై దృష్టి పెట్టే బదులు, తన లక్ష్యంపైనే శక్తినంతా కేంద్రీకరించగలుగుతారు.

ప్రఖ్యాత రచయిత థియోడర్ రూజ్‌వెల్ట్ చెప్పిన మాటలు ఈ సందర్భంలో గుర్తుచేసుకోదగినవి – వాస్తవంగా బరిలో దిగి పోరాడేవాడి గురించే గుర్తుంచుకోవాలని, పక్కన నిలబడి విమర్శించేవారి మాటలకు విలువ లేదని ఆయన అభిప్రాయపడ్డారు. అంటే, నిజమైన గౌరవం దక్కేది ప్రయత్నించే వారికే తప్ప, పక్కనుంచి విమర్శించే వారికి కాదు. ఇదే భావననే తెలుగు నీతి పద్యాలు కూడా చాటిచెప్పాయి. వేమన శతకంలో "ఓడిన వాడు మరల ప్రయత్నించునే గాని, జారిపడిన చోటనే కూర్చుండడు" అనే భావన పలుమార్లు ప్రస్తావితమవుతుంది – పడిన ప్రతిసారీ లేచి నిలబడటమే నిజమైన ధైర్యమని ఈ పద్యాలు బోధిస్తాయి. "లోకుల మాటలు విని తన పని మానుకొనువాడు, తన బతుకు తానే చెరచుకొనును" అనే నీతి వాక్యం కూడా, పరుల మాటలకు భయపడి తన లక్ష్యాన్ని విడిచిపెట్టే వారి గురించి హెచ్చరిస్తుంది. కాబట్టి, ఏదైనా కొత్త ప్రయత్నం చేయాలనుకున్నప్పుడు, "నలుగురూ ఏమనుకుంటారో" అనే ఆలోచనను పక్కనపెట్టాలి. ప్రపంచం మన గెలుపు ఓటములను లెక్కపెట్టుకుంటూ కూర్చోదు – అది తన పనిలో నిమగ్నమై ఉంటుంది. ఈ వాస్తవాన్ని గుర్తుంచుకుని, వైఫల్యం నుంచే విజయం వైపు ధైర్యంగా అడుగులు వేయడం అలవాటు చేసుకోవాలి. ప్రతి పతనం ఒక ముగింపు కాదు, అది విజయానికి దారితీసే మలుపు మాత్రమే. ఈ దృక్పథమే జీవితంలో నిజమైన స్వేచ్ఛను, నిజమైన శక్తిని అందిస్తుంది.

# కమలానికి మింగుడుపడని కథ!



బిహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ చవిచూసిన అనూహ్య ఓటమి; మధ్యప్రదేశ్‌లోని దహియాలో పార్టీ కోల్పోయిన సీటు; గుజరాత్‌లోని మంజల్‌పూర్‌లో బాగా తగ్గిన మెజారిటీతో దక్కించుకున్న గెలుపు –ఇటీవలి ఉప ఎన్నికల ఫలితాలను చూస్తే, యువ ఓటర్లలో బీజేపీపై నమ్మకం సన్నగిల్లుతున్న సంకేతాలు స్పష్టం. అయితే ఈ హెచ్చరిక కేవలం బీజేపీకే పరిమితం కాదు.. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకూ ఓటర్లు స్పష్టమైన సందేశాన్నే పంపారు. దేశ యువత రాజకీయాల పట్ల భ్రమలు వీడుతోంది, ఇక వారి ముందు రెండే మార్గాలు మిగిలాయి –రాణించడం లేదా కనుమరుగవడం. అయితే, ప్రస్తుతం కేంద్రంలో, చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీకి ఈ సంకేతాలు మరింత ఆందోళనకరం. ఎందుకంటే అధికారంలో ఉన్న పార్టీపైనే ప్రజావ్యతిరేకత ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. బంకిపూర్‌లో బీజేపీ ఓటమి అనేక కారణాల రీత్యా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నితిన్ నబిన్, బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఒకప్పుడు బీజేపీకి పోల్ వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్, ఇప్పుడు తన సొంత జన్ సురాజ్ పార్టీ తరపున బరిలో దిగడంతో, ఈ ప్రతిష్ఠాత్మక పోరులో గెలుపు కోసం బీజేపీ తన వనరులన్నింటినీ రంగంలోకి దించింది. మూడు దశాబ్దాలకు పైగా, అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో కూడా బీజేపీ అభ్యర్థినే ఎన్నుకున్న ఈ పట్టణ ప్రధాన నియోజకవర్గంలో, ఇది ఒక చారిత్రక ఓటమిగా నిలిచింది. దీర్ఘకాల మిత్రపక్షం జేడీ(యూ) నుంచి ముఖ్యమంత్రి పదవిని దక్కించుకుని, నితీశ్ కుమార్‌ను రాష్ట్ర రాజకీయాల నుంచి పక్కకు నెట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నిక కూడా ఇదే కావడం విశేషం. గణాంకాలే ఈ ఓటమి తీవ్రతను చెబుతున్నాయి.

2025లో 51,936 ఓట్ల మెజారిటీతో గెలిచిన ఈ స్థానంలో, ఈసారి బీజేపీ దాదాపు 19,000 ఓట్ల తేడాతో పరాజయం పాలైంది. కేవలం 34 శాతం మాత్రమే నమోదైన ఓటింగ్ శాతం, గత అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 41 శాతం కంటే గణనీయంగా తక్కువ కావడం కూడా గమనార్హం. తక్కువ ఓటింగ్ శాతం సాధారణంగా అధికార పార్టీకి ప్రతికూలంగా మారే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పోలింగ్‌కు ముందు తమ పార్టీ మద్దతుదారులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ప్రశాంత్ కిషోర్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం కూడా వివాదాస్పదమైంది. ఏదేమైనా, ప్రతి కారణం కూడా కాషాయ పార్టీకి తగిలిన ఈ దెబ్బను మరింత తీవ్రతరం చేసింది.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ చేతిలో బీజేపీ ఓటమి, ఆ రాష్ట్రంలో మోహన్ యాదవ్ ప్రభుత్వంపై తగ్గుతున్న ప్రజాదరణకు సంకేతంగా నిలిచింది. అయితే ఇది గతంలో బీజేపీ ప్రాతినిధ్యం వహించిన స్థానం కాదు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ అంతర్గత విభేదాలను ఎదుర్కొన్నా, చివరికి ఫలితాలు మాత్రం ప్రతిపక్షానికే అనుకూలంగా వచ్చాయి. అభ్యర్థుల ఎంపికలో స్థానిక నాయకత్వం మధ్య తలెత్తిన విభేదాలు ఫలితాలపై కొంతమేర ప్రభావం చూపినా, అంతిమంగా ఓటర్లు అధికార పార్టీపైనే తమ అసంతృప్తిని ప్రదర్శించారన్నది వాస్తవం. ముఖ్యమంత్రి అభ్యర్థుల విషయంలో బీజేపీ కొత్త ముఖాలతో ప్రయోగాలు చేస్తున్నా, "డబుల్ ఇంజిన్" అభివృద్ధి నినాదం ఆ రాష్ట్రంలో కనీసం తన ప్రభావాన్ని కోల్పోయినట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో తాను ఇంకా పోరాట శక్తిగా నిలిచి ఉన్నామన్న సంకేతం కాంగ్రెస్‌కు ఒక ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు కొంత సమయాన్నీ కల్పిస్తుంది. ఈ చిన్న విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది, అయితే దీర్ఘకాలిక వ్యూహం లేకుండా ఈ ఊపును కొనసాగించడం సాధ్యం కాదని పార్టీ నేతలు గుర్తుంచుకోవాలి. అయితే, బీజేపీకి అత్యంత నిరుత్సాహకరమైన ఫలితం వచ్చే ఏడాది జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, మంజల్‌పూర్ ఉప ఎన్నికలో నమోదైంది. ఆ స్థానాన్ని బీజేపీ నిలబెట్టుకున్నప్పటికీ, గెలుపు మార్జిన్ మాత్రం భయపెట్టే సంకేతాన్నే ఇస్తోంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 1,00,754 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన ఈ స్థానంలో, ఇప్పుడు ఆ మెజారిటీ కేవలం 30,630కి పడిపోయింది. అంటే మెజారిటీ మూడో వంతు కంటే తక్కువకు కుంచించుకుపోయింది. గుజరాత్ వంటి బీజేపీ కంచుకోటలో సైతం ఇలాంటి క్షీణత కనిపించడం పార్టీ నాయకత్వానికి ఆందోళన కలిగించే అంశమే. క్షేత్రస్థాయిలో గట్టిగా శ్రమించకపోతే, వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఓట్ల క్షీణతను భర్తీ చేసుకోవడం బీజేపీకి కష్టతరమే!

జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ఉద్యమం సాధించిన విజయం, అన్ని రాజకీయ పార్టీలకూ ఒక స్పష్టమైన సందేశాన్నే పంపింది. నేటి యువ తరం రాజకీయ నేతల హామీలపైనే ఆధారపడి జీవించేందుకు సిద్ధంగా లేదు; తమ జీవితాలపై సానుకూల ప్రభావం చూపే వాస్తవ చర్యలను వారు కోరుకుంటున్నారు. ఇటీవలి బై పోల్ ఫలితాలు ఈ మార్పును మరింత స్పష్టం చేస్తున్నాయి. ఓటర్లు, ముఖ్యంగా యువత, పార్టీల నినాదాలకు, వాగ్దానాలకు అతీతంగా ఆలోచిస్తున్నారని రుజువవుతోంది. బంకిపూర్‌లో వచ్చిన ఓటమి కేవలం ఒక స్థానిక సమస్యగా కొట్టిపారేయలేనిది. మూడు దశాబ్దాలుగా తిరుగులేని కంచుకోటగా నిలిచిన స్థానంలో ఇలాంటి ఫలితం రావడం, పార్టీ అంతర్గత వ్యూహాన్ని పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని చాటుతోంది. మధ్యప్రదేశ్, గుజరాత్ ఫలితాలు కూడా ఇదే కథను వేర్వేరు కోణాల్లో చెబుతున్నాయి. అభివృద్ధి నినాదాలు, డబుల్ ఇంజిన్ వాగ్దానాలు ఇకపై ఓటర్లను ఆకట్టుకోలేకపోతున్నాయని స్పష్టమవుతోంది. ఉపాధి కల్పన, విద్యా వ్యవస్థ మెరుగుదల, యువత వలసలను నివారించడం వంటి వాస్తవ సమస్యలపై దృష్టి సారించాలని ఓటర్లు కోరుకుంటున్నారని ఈ ఫలితాలు స్పష్టంగా చాటుతున్నాయి. రాబోయే గుజరాత్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ హెచ్చరిక సంకేతాలు బీజేపీకి ఒక కీలక పాఠంగా నిలవాలి. క్షేత్రస్థాయి పనితీరు, వాస్తవిక అభివృద్ధి ఫలితాలు లేకుండా, కేవలం నినాదాలతో ఓటర్లను ఆకట్టుకోలేమని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం అధికార పార్టీ వైఫల్యాలపైనే ఆధారపడకుండా, తమదైన సానుకూల ఎజెండాతో ఓటర్లను ఆకట్టుకోవాల్సిన సవాలు వారి ముందు కూడా ఉంది. చివరిగా, మార్పు కోసమో, పర్యవసానాలు ఎదుర్కోవడం కోసమో నిర్ణయం తీసుకోవాల్సింది రాజకీయ పార్టీలే. రాణించడం లేదా కనుమరుగవడం అనే రెండు మార్గాల మధ్య ఎంపిక చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైనట్టే!! ■




నొప్పి కలిగించేది ఎదుటివారి తప్పు కాదు, ఆ తప్పు చుట్టూ మనం అల్లుకునే ఊహల వల. అదే మనసును మరింత గాయపరుస్తుంది. కథలల్లడం మాని, జరిగిందేమిటో నిజాయితీగా చూడగలిగినప్పుడే మనసుకు నిజమైన నిశ్శబ్దం లభిస్తుంది. అలజడిలో తీసుకునే నిర్ణయం ఎప్పుడూ అసంపూర్ణమే, నిదానంలో పుట్టిన ఆలోచనే స్పష్టతనిస్తుంది. కెరటం చెలరేగినప్పుడే సముద్రాన్ని అంచనా వేయకూడదు, అది సద్దుమణిగాకే లోతు తెలుస్తుంది. అలాగే మనసుకు కూడా - ఆవేశం తగ్గాకే అసలు సత్యం కనిపిస్తుంది, సరైన దారి తడుతుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# చెస్ట్ ఫెయిరింగ్ వివాదం



మహిళల టూర్ డి ఫ్రాన్స్ సైక్లింగ్ పోటీలో వింత వివాదం చెలరేగింది. వేగం పెంచుకునేందుకు కొందరు సైక్లిస్టులు బ్రాలలో ప్యాడింగ్ వాడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. "చెస్ట్ ఫెయిరింగ్" అని పిలిచే ఈ పద్ధతి వల్ల శరీరం చుట్టూ గాలి ప్రవాహం మారి, గాలి నిరోధకత తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. హెరియట్–వాట్ యూనివర్సిటీ ఏరోడైనమిక్స్ ప్రొఫెసర్ బర్ట్ బ్లోకెన్ ప్రకారం, ఈ టెక్నిక్ డ్రాగ్‌ను 3.6 శాతం వరకూ తగ్గించగలదు. చిన్న శాతంగా అనిపించినా, క్షణాల తేడాతో విజేతలు నిర్ణయమయ్యే ఈ క్రీడలో ఇది అనుచిత లాభంగా పరిగణిస్తున్నారు. దీంతో నిర్వాహకులు ఆగస్టు 4న అదనపు దుస్తుల తనిఖీలు చేపట్టారు, నిబంధనలను మరింత కఠినతరం చేశారు.

# కొత్త కలయికలో ఇంగ్లండ్‌కు తొలి పరీక్ష..
# పోప్, లారెన్స్‌కు పిలుపు..!

కొత్త కోచ్, కొత్త కెప్టెన్ నేతృత్వంలో ఇంగ్లండ్ జట్టు తొలి పరీక్షకు సిద్ధమవుతోంది. జో రూట్ సారథ్యం, స్టీఫెన్ ఫ్లెమింగ్ కోచింగ్‌లో మొట్టమొదటి టెస్టు సిరీస్ ఆడుతున్న ఇంగ్లండ్ స్క్వాడ్‌ను ప్రకటించింది. స్వదేశంలో పాకిస్థాన్‌తో మూడు టెస్టుల సిరీస్ కోసం గురువారం ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు() పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. తొలి రెండు మ్యాచ్‌లకు యువకెరటం జాకబ్ బెథెల్ దూరమవ్వగా.. సీనియర్ ఓలీ పోప్ స్క్వాడ్‌లోకి వచ్చాడు.

బజ్ బాల్ ఆటకు చెల్లుచీటీ ఇచ్చిన ఇంగ్లండ్ నాయకత్వ మార్పు, కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ రాక అనంతరం తొలి పరీక్ష ఎదుర్కోనుంది. స్వదేశంలో పాకిస్థాన్‌తో టెస్టు సవాల్‌కు కాచుకొని ఉంది జో రూట్ సేన. దాంతో, మొదటి రెండు టెస్టులకు గురువారం సెలెక్టర్లు 16 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. అయితే.. జాకబ్ బెథెల్ అనూహ్యంగా స్క్వాడ్‌కు దూరమయ్యాడు. ఇటీవల టీ20లు, వన్డేల్లో ఓపెనర్‌గా రాణిస్తున్న బెథెల్ మోకాలి గాయం కారణంగా అందుబాటులో లేడు. న్యూజిలాండ్‌తో సిరీస్ ఆడని సీనియర్ బ్యాటర్ ఓలీ పోప్, బ్రైడన్ కార్సే, డాన్ లారెన్స్ లకు అవకాశం దక్కింది. జోర్డాన్ కాక్స్ మూడో స్థానంలో ఆడనున్నాడు.



ఈమధ్యే న్యూజిలాండ్ చేతిలో 2-1తో సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ ఈసారి పంజా విసరాలనుకుంటోంది. పాకిస్థాన్‌తో ఆగస్టు 19 నుంచి హెడింగ్లేలో తొలి టెస్టు మొదలవ్వనుంది. రెండో మ్యాచ్ ఆగస్టు 27 నుంచి.. మూడోది సెప్టెంబర్ 9వ తేదీన జరుగనుంది. ఇంగ్లండ్ టెస్టు స్క్వాడ్ : బెన్ డకెట్, ఎమిలియే గే, ఓలీ పోప్, జో రూట్(కెప్టెన్), జేమీ స్మిత్(వికెట్ కీపర్), ఆర్చర్, అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, కార్సే, సామ్ కుక్, జోర్డాన్ కాక్స్, మాథ్యూ ఫిషర్, డాన్ లారెన్స్, రాబిన్సన్, టంగ్.

## ఆసియా కప్ షెడ్యూల్ విడుదల..
## సెప్టెంబర్ 5న భారత్, పాకిస్థాన్ మ్యాచ్..!

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ మళ్లీ చూసే అవకాశం రాబోతోంది. ఇటీవలే మహిళల వన్డే ప్రపంచకప్‌లో తలపడిన దాయాదులు ఈసారి ఆసియా కప్(గాంఋ జబజూ 2026)లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆసియా దేశాలు పోటీపడే ఈ మెగా టోర్నీకి దుబాయ్ ఆతిథ్యమిస్తోందని, ఆగస్టు నెలఖరులో మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయని ఆసియా క్రికెట్ మండలి(గాజజ) తెలిపింది. గురువారం టోర్నీ షెడ్యూల్ విడుదల చేసింది ఏసీసీ. ప్రతిష్ఠాత్మక మహిళల ఆసియా కప్ షెడ్యూల్ వచ్చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని గురువారం ఆసియా క్రికెట్ మండలి వెల్లడించింది. ఆగస్టు 28 నుంచి పోటీలు మొదలవుతాయని పేర్కొన్న ఏసీసీ.. అందరూ ఆసక్తి కనబరిచే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరుగనుందని చెప్పింది.

**టాప్ -- 2 జట్లు సెమీస్‌కు**

రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగనున్న ఆసియా కప్‌లో గ్రూప్ ఏ, గ్రూప్ బీలో ఐదేసి జట్లున్నాయి. భారత్, పాకిస్థాన్, చైనా, హాంకాంగ్, థాయ్‌లాండ్ మొదటి గ్రూప్‌లో.. ఆతిథ్య యూఈఏ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియాలు గ్రూప్ బీలో ఉన్నాయి. లీగ్ దశలో పాక్‌తో పాటు చైనా,



హాంకాంగ్, థాయ్‌లాండ్‌ను టీమిండియా ఢీకొట్టనుంది.ప్రతి గ్రూప్ నుంచి టాప్ -- 2 జట్లు సెమీస్‌కు వెళ్తాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్‌తో విజేత ఎవరో తేలిపోనుంది.

# స్పోర్ట్స్

## టాప్ సీడ్‌గా అమ్మాయిల జట్టు
### చెస్ ఒలింపియాడ్‌లో అర్జున్ టీమ్‌కు రెండో సీడింగ్




న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల జట్టు టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుంది. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్ వేదికగా సెప్టెంబర్ 15నుంచి 28 వరకు జరిగే ఈ మెగా టోర్నీ ఓపెన్ సెక్షన్‌లో తెలంగాణ కుర్రాడు ఇరిగేశి అర్జున్‌తో కూడిన అబ్బాయిల జట్టు రెండో సీడ్‌గా పోటీ పడనుంది. అమెరికా టీమ్‌కు టాప్ సీడింగ్ దక్కింది. గత ఎడిషన్‌లో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలు నెగ్గి డిఫెడింగ్ చాంపియన్ల హోదాతో ఈ టోర్నీకి సిద్ధమవుతున్నాయి. ఓపెన్‌లో అమెరికాతో పాటు మూడో సీడ్, ఆతిథ్య జట్టు ఉజ్బెకిస్థాన్, చైనా, జర్మనీ, నెదర్లాండ్స్ బలమైన పోటీదారులుగా ఉన్నాయి. అమ్మాయిల జట్టుకు రెండో సీడ్ జార్జియాతో పాటు కజకిస్థాన్, చైనా నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. 46వ ఎడిషన్ ఒలింపియాడ్‌లో రికార్డు స్థాయిలో 400 జట్లు పోటీ పడనున్నాయి. ఓపెన్‌లో 208, మహిళల విభాగంలో 192 దేశాలు పోటీలో ఉన్నాయి.

## మెస్సీ మాయ మళ్లీ మొదలు..



మయామి: ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి బాధ తర్వాత అర్జెంటీనా సాకర్ లెజెండ్ లియోనల్ మెస్సీ మైదానంలో మళ్లీ మెరుపులు మెరిపిస్తున్నాడు. ఫిఫా కప్ ముగిసిన అనంతరం లీగ్స్ కప్‌లో ఇంటర్ మయామి క్లబ్ తరఫున బరిలోకి దిగిన మెస్సీ తన రెండో మ్యాచ్‌లో డబుల్ గోల్స్‌తో మ్యాజిక్ చేశాడు. దాంతో ఇంటర్ మయామి టీమ్ 4-2తో అట్లెటికో సాన్ లూయిస్‌పై విజయం సాధించింది. బుధవారం రాత్రి వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో 11వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టిన మెస్సీ.. 44వ నిమిషంలో మరోసారి బంతిని నెట్‌లోకి పంపించాడు. దాంతో ఈ టోర్నీలో మెస్సీ కొట్టిన గోల్స్ సంఖ్య 14కు (12 మ్యాచ్‌ల్లో) చేరింది. ఫలితంగా నాలుగేండ్ల ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా లాస్ ఏంజెల్స్ ఎఫ్‌సీ ప్లేయర్ డెనిస్ బౌంగా (13 గోల్స్) రికార్డును అర్జెంటీనా లెజెండ్ బ్రేక్ చేశాడు.

## దిశా పటానీ: ఎల్లే కవర్‌పై చంపు తోంది



# ఆపుకుందామన్నా ఆపుకోలేకపోయిన జాన్వీ చివరికిలా



టాలీవుడ్ లో దేవర, పెద్ది సినిమాల తర్వాత కోలీవుడ్ పై దృష్టి సారించింది జాన్వీకపూర్. అక్కడ తన మొదటి ప్రాజెక్ట్ ప్రకటన ఉంటుందని ప్రచారం సాగుతోంది. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న తన ఫ్యాన్స్ కోసం జాన్వీ ట్రీట్ ఆగడం లేదు. అందాల భామ జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో కావాల్సినంతా వినోదం పంచుతున్నారు. తన లేటెస్ట్ ఫోటోషూట్లు, అవుట్‌ఫిట్లతో అభిమానులను నిరంతరం అలరించే ఈ బ్యూటీ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన కొన్ని క్యూట్ అండ్ స్టైలిష్ ఫోటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.

ఈ ఫోటోలను షేర్ చేస్తూ జాన్వీ కపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సరదా క్యాప్షన్ రాసుకొచ్చారు. నేను ఆపుకుందామనే ప్రయత్నించాను.. కానీ ఈ పిక్స్ చాలా క్యూట్‌గా ఉండటంతో పోస్ట్ చేయకుండా ఉండలేకపోయాను! అంటూ దిష్టి తగలకుండా దిష్ఠి కన్ను ఎమోజీని క్యాప్షన్‌గా జోడించారు. ముఖ్యంగా ఈ ఫోటోషూట్ లో ఆకుపచ్చ రంగు దుస్తుల్లో జాన్వీ మెరిసిపోతున్న తీరు చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు.

ఈ పోస్ట్ చూసిన సినీ సెలబ్రిటీలతో పాటు లక్షలాది మంది అభిమానులు కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని కురిపిస్తున్నారు. ప్రముఖ నటి సోనమ్ బాజ్వాతో పాటు పలువురు డిజైనర్లు, శ్రేయోభిలాషులు జాన్వీ అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు పెట్టారు. బార్బీ డాళ్‌లా ఎంతో క్యూట్‌గా, ఎలిగెంట్‌గా ఉన్నారు! అంటూ ఫ్యాన్స్ క్యూట్ జాన్వీ లుక్స్‌పై ఈలలు వేస్తున్నారు.

మరోవైపు కామెంట్ సెక్షన్‌లో అభిమానుల హడావుడి మామూలుగా లేదు. చాలామంది నెటిజన్లు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఈ చిన్నారికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ సుదీర్ఘమైన మెసేజ్‌లు పోస్ట్ చేశారు. అలాగే పాపులర్ ఫ్యాన్స్ గ్రూప్స్ లలో కూడా పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తూ ఈ పోస్ట్‌ను సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడానికి పోటీ పడ్డారు. ప్రస్తుతం ఈ పోస్ట్‌కి 4 లక్షలకు పైగా లైకులు, వేల సంఖ్యలో కామెంట్లు వచ్చి చేరుతుండటంతో జాన్వీ కపూర్ పిక్స్ నెట్టింట కాక రేపుతున్నాయి. సినిమా ఆఫర్లతో ఎంత బిజీగా ఉన్నా.. ఇలాంటి సరదా ఫోటోలతో అభిమానులకు నిరంతరం టచ్‌లో ఉండటం జాన్వీకే చెల్లిందని కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే పెద్ది తర్వాత జాన్వీ కపూర్ నటించే సినిమాలకు సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com